
మాగుంట సుబ్బరామ రెడ్డి

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు ఆవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 261 • పేజీలు : 8 • గురువారం 13 జూన్ 2024 • వెల : రూ. 5.00
Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati





# కొలువుదీరిన చంద్రన్న



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను అంటూ ప్రమాణం చేస్తుంటే... సభా ప్రాంగణం ఒక్కసారిగా దద్దరిల్లింది. ప్రమాణం చేసిన తర్వాత మంత్రి పవన్ కల్యాణ్ తన అన్న చిరంజీవి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.



మంగళగిరి నుంచి పోటీచేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన నారా లోకేష్ మంత్రిగా ప్రమాణం చేసారు.

లోకేష్ ఇప్పటికే ఒకసారి మంత్రిగా పని చేసిన అనుభవం ఉంది. *2014*లో నవ్యాంధ్రలో కొలవుదీరిన తొలి ప్రభుత్వంలో ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వర్తించారు..

*నేడు సాయంత్రం 4:41 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చెప్పట్టనున్న చంద్రబాబు*
*మొత్తం 5 ఫైల్స్ పై సంతకాలు చేయనున్న సీఎం చంద్రబాబు.*

- తొలి సంతకం - మెగా డీఎస్సీ పై.
- రెండో సంతకం - ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
- మూడో సంతకం - 4వేల రూపాయలకు పింఛన్ పెంపు.
- 4వ సంతకం - అన్న క్యాంటిన్ పునరుద్ధీకరణ.
- 5వ సంతకం - స్కిల్ సెన్సెక్స్ పై.

సిఎంగా చంద్రబాబు ప్రమాణం
పవన్ కళ్యాణ్, లోకేశ్ తదితరుల ప్రమాణం
ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, గడ్కరీ తదితరులు

7లో



## ఉగ్రవాది క్షమాభిక్ష తిరస్కరణ

పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, జూన్ 12:** ఎర్రకోట దాడి కేసులో పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. దేశ సార్వభౌమత్వానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఎర్రకోటపై దాదాపు 24 ఏళ్ల క్రితం ఉగ్రవాదులు మిగతా 7లో

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

- ఇది చిన్న విజయం కాదు
- అధికా మెజార్టీ ఇవ్వడంతో ప్రజల హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండాలన్నదే ప్రజల ఆకాంక్ష
- అందుకు అనుగుణంగా పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారు
- అధికారం ఇచ్చిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు
- అమరావతి, పోలవరం నిర్మాణం మన ప్రాధాన్యత
- బిజెపి పదాధికారుల సమావేశంలో పురంధేశ్వరి



**విజయవాడ, జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అనూహ్యమైన విజయాన్ని సాధించిందని, ఇది చిన్న విజయం కాదు.. అద్భుతమైన విజయమని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ఈ విజయంలో మనకు ఒక హెచ్చరిక, గమనిక ఉంది. గడచిన ఐదేళ్లలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. గత ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఆమె అన్నారు. విజయవాడలోని మిగతా 7లో



## ఏపీలో శాంతి భద్రతలను పరిరక్షించాలి

చట్టం, సేచ్ఛ, న్యాయం లేదు...అన్యాయమే రాజ్యమేలుతోంది
ఫిర్యాదు చేస్తున్న పోలీసులు స్వీకరించని వైనం...
వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వాళ్ల ఆస్తులే లక్ష్యంగా దాడులు
"ఇది చీకటి అధ్యాయంగా చరిత్రలో మిగిలిపోతుంది
ఏపీలో టిడిపి దాడులపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):**ఏపీలో జరుగుతున్న టీడీపీ దాడులపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. అనంతరం ఆ పార్టీ నేతలు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపీలో శాంతి భద్రతలను పరిరక్షించాలని రాష్ట్రపతిని కోరినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. వారం రోజులుగా టీడీపీ శ్రేణులు మిగతా 7లో



## గెలుపు కోసమే మత రాజకీయం

ఓట్ల కోసమే రామమందిరం నిర్మాణం
మోదీజీ.. సొంత మెజార్టీ ఎక్కడా?
టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీష్ కుమార్ సహాయంతో బిజెపి ప్రభుత్వ ఏర్పాటు
శరద్ పవార్ వ్యాఖ్యలు 7లో

## పేద ప్రజలే నా దేవుళ్లు

- ప్రధానిలా నన్ను ఏ దేవుడు గైడ్ చెయ్యడం లేదు
- రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉండటమే తనకు కావాలి
- దేశంలోని పేదలు, వయనాడ్ ప్రజలే నాకు దేవుళ్లు..
- నూతన కేంద్రం ప్రభుత్వం వికలాంగ ప్రభుత్వం
- ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



**వయనాడ్, జూన్ 12:**2024 లోక్ సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి గెలిపించి నందుకు కేరళ ఓటర్లకు ఏఐసీసీ అగ్రనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కృతజ్ఞతలు చెప్పారు. కేరళలోని మలప్పురంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. రాహుల్ గాంధీ వయనాడ్ నుంచే మిగతా 7లో

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం

పిడుగుపాటు కారణంగా 11 మంది మృతి 7లో

## లైంగిక వేధింపుల కేసులో యడియూరప్పకు నోటీసులు

7లో



## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

భవనంలో ఎగిసిపడ్డ మంటలు
43 మంది భారతీయులు సజీవ దహనం
కువైట్ మృతుల కుటుంబాలకు మోడీ సంతాపం

**కువైట్, జూన్ 12:** కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలో మంటలు చెలరేగడంతో 43 మంది సజీవ దహనమయ్యారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కువైట్‌లోని అహ్మదీ గవర్నరేట్‌లోని మంగాఫ్ బ్లాక్‌లో 6 అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. నివేదికల ప్రకారం మృతుల్లో ఐదుగురు మలయాళీలు ఉన్నారు.అక్కడి కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు లేబర్ క్యాంపులోని కింది అంతస్తులోని ఒక మిగతా 7లో





## ఢిల్లీలో బాంబు బెదిరింపులు

5 మ్యూజియంలకు హెచ్చరికలు..!
ఈ మెయిల్స్ ద్వారా వార్నింగ్స్
ఎంక్వైరీ చేపడుతున్న పోలీసులు
హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళన 7లో



ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు


# బాల్యం?

"కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు –పేర్లకీ పకీర్లకీ పుకార్లకీ నిబద్ధులు" అన్నాడు మహాకవి శ్రీశ్రీ.ఈ పంక్తులకు ఫక్తు ప్రతిబింబంగా వుంది నేటి సమాజం.మరీ కొన్నాళ్ల నుంచి... పిల్లలపై వస్తున్న వార్తా కథనాలు వినలేకపోతున్నాం.ముక్కుపచ్చలారని పిల్లలపై లైంగిక వేధింపులు అనే మాటలు సామాజిక రాక్షసత్వానికి,జవజీవాలు చచ్చిన మానవ నాగరిక సంస్కారానికి అద్దం పడుతున్నాయి.ఇక పిల్లల హక్కులు అన్న మాట అటకెక్కి చాలారోజులైంది.దేశంలో అక్షరాస్యత పెరుగుతున్నంతగా జ్ఞానం ప్రసరించడం లేదు, సంస్కారం ప్రవహించడం లేదు.కొత్త సమాచార సాంకేతికత పుణ్యంగా,పదేళ్లకే చూడకూడని దృశ్యాలు,వినకూడని, అనకూడని మాటలు చిన్నారులకు చేరిపోతున్నాయి. ఎక్కిరిస్తున్న పేదరికం మాటున కూలిపనులు తప్పని స్థితిలోనే పిల్లలు ఎందరో ఉన్నారు.కరెంటు వెలుగుల మధ్య కూడా బాల్యం చీకటైపోతున్న కటిక కష్టాల పర్వం యదేచ్ఛగా సాగుతునే వుంది. లోపాలు ఎక్కడున్నాయని తరచి చూస్తే? అవి ఇంటి నుంచి మొదలై బడిలో పెరిగి సమాజంలో విస్తృత వికృత రూపాన్ని దాలుస్తున్నాయని అర్థం చేసుకోవాలి. పెంపకం ప్రథమ లోపం,పాఠశాలల వాతావరణం రెండో లోపం, చుట్టూ వున్న సమాజం ఆ పై లోపం,ప్రభుత్వాలది పై ఎత్తు లోపం.మొత్తంగా పర్యవేక్షణ శూన్యం.గారాబం మాటున కొందరు, హాస్టల్ల మధ్య స్వేచ్ఛా జీవనంతో మరికొందరు,విద్యతో పాటు బుద్ధులు చెప్పే ఉపాధ్యాయుల లేమితో ఇంకొందరు చిన్నారులు ఆ యా స్థాయిల్లో చెడిపోతున్నారని మానసిక శాస్త్రవేత్తలు చేస్తున్న వ్యాఖ్యలను మనం కొట్టి పారెయ్యలేం. గణనీయంగా పెరుగుతున్న పేద–పెద్దల వ్యత్యాసం మధ్య బాలకార్మికులు లేని సమాజం ఊహించగలమా? అనే సందేహం మరింత పెరుగుతోంది. పిల్లలను ఆటలకు పాటలకు దూరం చేస్తూ, పోటీని పెంచుతూ, అభ్యాసం పేరుతో పగలు రాత్రులు తోముతూ వున్న విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి.గురుశిష్య బంధాలలో పవిత్రత దూరమై చాన్నాళ్లయింది. గురుశిష్యుల మధ్య ప్రేమపెళ్లిళ్లు మొదలై కూడా చాలా కాలమైంది. గురువులను శిష్యులు,శిష్యులను గురువు చూసే చూపులు మారి ఎన్నో ఏళ్లైంది.మారుతున్న సామాజిక పోకళ్ల మధ్య ఈ దుర్వ్యవస్థ నేడు పతాక స్థాయికు చేరుకుంది. విద్య అత్యంత ఖరీదైన వస్తువైంది. అది అతి పెద్ద వ్యాపారమై కూర్చుంది. నీతి శతకాలు, సామెతలు,పొడుపు కథలు, గాథలు,పురాణేతిహాసాలు చెప్పే అమ్మలు, అమ్మమ్మలు కరవైన కాలం వచ్చీ చాలాకాలమైంది. ఐన్ స్టీన్ చెప్పినా, గాంధీ నెహ్రూలు చెప్పినా చెప్పింది ఒకటే అది మనోవికాసం! అడ్డాల నాడే మంచి అలవాట్లు అలవాటు చేయమని, గొప్ప కథలు,చరిత్ర,గొప్పవాళ్ళ జీవిత చరిత్రలు చెప్పమని వారంతా కోడై కూశారు.విద్యా విధానంలో 'బిడ్డల శిక్షణ' ప్రత్యేకమైన సబ్జెక్టు. 'బిడ్డల శిక్షణ' పేరుతో మహారచయిత గుడిపాటి వెంకటాచలం మంచి పుస్తకం కూడా రాశారు. పిల్లలు ప్రకృతికి కూడా దూరమయ్యారు. సూర్యోదయం,సూర్యాస్తమయం తెలియదు. చంద్రుడు,వెన్నెల,చుక్కలు చూసే పరిస్థితులు లేనే లేవు. తెలుగు నుడికారం,జాతీయాలు అస్సలు తెలియదు. మాతృభాషకు దూరమవుతూ మేధో వికాసాన్ని దూరం చేసుకుంటున్న వాతావరణంలోనే ఎక్కువ పాళ్ళు జీవిస్తున్నారు. 12–14 ఏళ్ళ ప్రాయం వరకూ మాతృభాష/ స్థానిక భాషలో బోధన జరిగితే పిల్లలకు గ్రహణశక్తి పెరుగుతుందని తద్వారా మెదడు అత్యంత చురుకుగా పనిచేసే విధంగా ఎదుగుతుందని విద్యాశాస్త్ర నిపుణులు చెబుతున్న మాటలు వినే పరిస్థితిలో అసలు తల్లిదండ్రులే లేరు.ఆ విధంగా ప్రజల డిమాండ్ బట్టి పాఠశాల విద్యా విధానాన్ని ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయి. మాతృభాషపై మమకారాన్ని పెంచడం ఎంత ముఖ్యమో బాల్యంలో మాతృభాషలో బోధన అంతకంటే ముఖ్యం,కీలకమని ఆలోచించాల్సింది తల్లిదండ్రులు. ఇంగ్లిష్ రుద్దుడుపై ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవడం వెనకాల మొదటి తప్పు తల్లిదండ్రులదే. మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి. పిల్లల సంక్షేమం,భావ వ్యక్తీకరణ, పరస్పర అవగాహన పెరిగే విధంగా దోహదం చేసే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. పర్యవేక్షణ అందరి బాధ్యత. బాలలకు ఎటువంటి హక్కులు ఉన్నాయో ఎవరికీ తెలియదు. పిల్లలకు అస్సలు తెలియదు. హక్కుల ప్రచారంలో లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రతి పౌరుడికీ ప్రధానంగా ప్రాథమిక విద్య అందాలి. నిర్లక్ష్యానికి గురయ్యే పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనం కావాలంటే పేదరికం పోవాలి. శిక్షణ పేరుతో కఠినంగా శిక్షించే సంస్కృతికి పాతరెయ్యాలి. బాలల హక్కుల పరిరక్షణకు గ్రామ పంచాయతీల స్థాయి నుంచి బాధ్యతలు పెంచాలి. పిల్లలకు చుట్టూ మంచి వాతావరణం కల్పించాలి. పోషకాహారం,ఆరోగ్యం, అభివృద్ధి, విద్య, వినోదం అన్నీ అందించాలి. పిల్లల అమ్మకాలు, రవాణాను అడ్డుకోవాలి. సృజన పెంచే అలవాట్లన్నీ అందించాలి.మానసికంగా, శారీరకంగా పటుత్వం పెరిగితే? మళ్ళీ మహాకవి శ్రీశ్రీయే అన్నట్లు.. " కొంతమంది యువకులు ముందుయుగం దూతలు పావన నవజీవన నిర్మాతలు" అవుతారు. ప్రతి నవంబర్ 14 బాలలదినోత్సవం జరుపుకుంటున్నాం కూడా. ఆరోజు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం కూడా. మహనీయులు వేసిన బంగారుబాటలో పిల్లలని నడిపిస్తేనే బంగారు భారతం నిర్మాణమవుతుంది.

# గ్రంథాలయోద్యమ 'గాంధీ'



సామాన్య కుటుంబంలో జన్మించారు. విద్య పట్ల ఆపేక్ష ఉండేది. ఆర్థిక పరిస్థితులు అడ్డు నిలవటంతో కళాశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవలేకపోయారు. అంది వచ్చిన ఉద్యోగంలో చేరారు. ఉద్యోగానికి సార్థకత కల్పించటం కోసం అహర్నిశలూ శ్రమించారు. పి.హెచ్.డి. కూడా పూర్తి చేశారు. గ్రంథాలయాల అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలంటే వారికి పుస్తకాలపై మక్కువ పెంచాలని అభిప్రాయపడ్డారు. గ్రంథ పఠనంపై విద్యార్థులు ఆసక్తులు కావటానికి వారి అభిరుచులకు అనువైన పుస్తకాలు తయారు చేశారు. "బాలబంధు"గా చరిత్రలో నిలిచారు వెలగా వెంకటప్పయ్య. వెలగా వెంకటప్పయ్య 1932 జూన్ 12న జన్మించారు. గుంటూరు జిల్లా, తెనాలిలోని ఐతానగర్ వీరి జన్మస్థలం. తల్లి వెంకట రత్తమ్మ, తండ్రి నాగయ్య. వీరిది సామాన్య రైతు కుటుంబం. వెంకటప్పయ్య ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలను నెల్లూరులోనే పూర్తి చేశారు. స్కూలు ఫైనల్ (యస్.యస్.యల్.సి.)తో చదువు ఆగిపోయింది. అప్పటికి తెనాలిలో కళాశాల లేకపోవటం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదవలేకపోయారు. స్కూల్ ఫైనల్ పూర్తి చేసిన రెండేళ్ళ తర్వాత తెనాలిలో కళాశాల ఏర్పాటయింది. అప్పుడు ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తెనాలిలో ఏర్పాటైన ప్రారంభించినది జూనియర్ కళాశాల కావటం వల్ల డిగ్రీ చదివే అవకాశం లేకుండా పోయింది. మళ్ళీ చదువు ఆగింది. ఇతర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ చదివే అవకాశాలు లేకపోవటం వల్ల ఉద్యోగ ప్రయత్నాలు చేశారు. ఫలించాయి. 1956లో జిల్లా గ్రంథాలయ సంస్థల సాధారణ ఉద్యోగిగా చేరి, ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఇంటర్‌తో ఆగిపోయిన చదువు కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రయివేటుగా డిగ్రీ, యం.ఏ.లు అందుకున్న అనంతరం పి.హెచ్.డి.లు అందుకొని డి.యల్.యసి.సి. కూడా పూర్తి చేశారు. గ్రంతాలయోద్యోగిగా కాలం వెళ్ళబుచ్చుతున్న కాలంలోనే బాల్యం నుంచి అభిలాష కలిగిన గ్రంథపఠనంపై మక్కువ పెంచుకున్నారు. ఆ మక్కువే వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళింది. ఉద్యోగం చేస్తూనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. బాల్యంలో 'చందమామ' లాంటి బొమ్మల పుస్తకాలు చదివేవారు. 1949లోనే బొమ్మల కథ పుస్తకం వెలువరించారు. అప్పటికి వారి వయసు 17 ఏళ్ళు మాత్రమే. గ్రంథాలయ ఉద్యోగిగా స్థిరపడిన అనంతరం చదువు పట్ల బాలలకు మక్కువ పెంచటం కోసం తన శక్తి మేరకు ప్రయత్నాలు చేశారు. బాలలను భావి భారతపౌరులుగా మలచటానికి అవసరమైన బాల సాహిత్యం 50కి పైగా వారు రాశారు. తెలుగులో "బాల సాహిత్య వికాసం–ఆంధ్రప్రదేశ్ లో బాలల ప్రగతి" అనే అంశంపై పరిశోధనలు చేసి పరిశోధనా పత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించి పి.హెచ్.డి. పట్టా అందుకున్నారు. బంగారు పతకం కూడా అందుకున్నారు. ఈ పరిశోధనా పత్రానికి త్రిపురనేని గోపీచంద్ స్మారక స్వర్ణ పతకం లభించిం ది. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడెమీ కార్యవర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు భాషకు ఆటపట్టు, తెలుగు వారికి ఆరాధ్య పుస్తకమైన 'పెద్ద బాలశిక్ష'ను ఆధునీకరించి 1200 పేజీలతో పెద్ద సైజులో ముద్రించి ప్రజలకు తెలుగు భాష పట్ల అభిలాష పెంచారు.1969లో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పదోన్నతి పొందారు. 1990 జూన్ నెలలో పదవీవిరమణ చేశారు. మూడున్నర దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించి ప్రజల్ని గ్రంథపఠనం వైపు దృష్టి సారించే ప్రయత్నం చేశారు. గ్రంథాలయాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. కళాకారులను, కవులను, రచయితలను గ్రంథాలయాలకు రప్పించి కవితా గోష్టులు ఏర్పాటు చేసి, సామాన్య ప్రజానీకానికి సాహిత్యం పట్ల మక్కువ పెంచేందుకు శ్రమించారు. సామాన్య ప్రజలకే కాకుండా విశ్వవిద్యాలయం విద్యార్థులకు అవసరమైన గ్రంథాలయ సర్టిఫికేట్ కోర్సుకు పాఠ్యాంశాలను కూడా రూపొందించారు. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ స్థాయి విద్యార్థులకు "గ్రంథాలయం సమాజం" అనే పాఠ్య పుస్తకానికి సంపాదకత్వం వహించారు. విజయవాడలోని శిక్షణాలయంలో రెండేళ్ళ పాటు ప్రిన్సిపాలుగా పనిచేశారు. అఖిల భారత ఆదర్శ పౌర గ్రంథాలయాల చట్టం రూపశిల్పి కూడా వీరే! సోవియట్ ఆహ్వానంపై మాస్కో వెళ్ళారు. గ్రంథాలయాల విషయంలో వారు అక్కడ పరిశీలనలు కొనసాగించారు. "లెనిన్ గ్రంథాలయ విధానం", "లైబ్రరీ–సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్" లాంటి గ్రంథాలను రాశారు. రాజా రామమోహన్ రాయ్ గ్రంథాలయ ఫౌండేషన్, కేంద్ర సాహిత్య అకాడెమీలలో సభ్యునిగా కొనసాగుతున్న కాలంలో ప్రముఖ గ్రంథాలయాల్లో మైక్రో ఫిల్ములు తీయటం, డిజిటలైజేషన్ చేసి గ్రంథాలను భద్రపరచటం లాంటి అధునాతన ప్రక్రియలకు నాందీవాక్యం పలికింది వెలగా వెంకటప్పయ్యని అంటారు. పదవీ విరమణ తర్వాత కూడా గ్రంథాలయ పరిజ్ఞానం సామాన్యులకు అందించటం కోసం అహర్నిశలూ శ్రమించారు. బాలల కోసం పెద్ద బాలశిక్ష గ్రంథాన్ని సులభశైలిలో అందించటంతో పాటు 12 శతకాలకు టీకా తాత్పర్యాలు సమకూర్చారు. బాలల కోసం 3,000 తెలుగు సామెతలు సమకూర్చారు. 1000కి పైగా తెలుగు బాలల జానపద గేయాలు, 3000కి పైగా పొడుపు కథలు, 15,000కి పైగా జాతీయాలు సేకరించి, ప్రచురించి అందించారు. గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి 60 గ్రంథాలు, నిఘంటువులు ప్రచురించారు. వయోజనవిద్యకు సంబంధించి 40 గ్రంథాలు రచించారు. బాల సాహిత్యంలో 250కి పైగా గ్రంథాలకు సంపాదకత్వం వహిం చారు. వయోజనవిద్యా పరిజ్ఞానం ఇనుమడింపజేయటం కోసం 200 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. 3,000 మంది ప్రముఖుల జీవిత సమాచారం అందిస్తూ విడుదలైన గ్రంథానికి కూడా సంపాదకత్వం వహించారు. గ్రంథాలయ రంగంలో వారు సృష్టించని అంశమంటూ లేదని ఋజువు చేశారు. గ్రంథా లయ వర్గీకరణ, గ్రంథాలయ సూచీకరణ, పుస్తకాల అమరిక లాంటి విషయాల్లో భవితకు మార్గదర్శకంగా నిలిచారు. వీరి కృషి భావితరాలకు వివరించటం కోసం సంస్థలు మాత్రమే కాకుండా, ప్రభుత్వం కూడా ముందడుగు వేసి తెనాలిలోని రెండు వీధులకు వారి పేరు పెట్టారు. 2013 జూన్ లో వారి జన్మదినం పురస్కరించుకొని విజయనగరం జిల్లాలో ఒకే రోజు 50 గ్రంథాలయాలు ప్రారంభించటం విశేషం. ఇలాంటి ప్రాధాన్యతలెన్నో వెంకటప్పయ్య వల్ల ప్రజల కు సమకూరాయి. వీరు కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహా మండలి సభ్యులుగా బాధ్యాట్లు నిర్వర్తించారు. రాష్ట్ర, కేంద్ర తెలుగు అకాడెమీలతో పాటు మద్రాసులోని తెలుగు అకాడెమీ కూడా వీరికి పురస్కారం అందించింది. 2012లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందించింది. కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆలూరి బైరాగి పురస్కారం అందించింది. గ్రంథాలయ పితామహునిగా, గ్రంథాలయ గాంధీగా ప్రశంస లందుకున్న వెలగా వెంకటప్పయ్య 2014 డిసెంబరులో స్వర్గస్తులయ్యారు.

– దాసరి ఆళ్వారస్వామి

# కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు నంబూద్రిపాద్



నంబూద్రిపాద్ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యునిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్సు వాద సూత్ర బద్ధుడు, విప్లవ వాది, రచయిత, చరిత్రకారుడు. మార్క్సు వాద కమ్యూనిస్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియాశీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందు చూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణలను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రాలలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు.ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శకులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ అభివర్ణించినట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఏలాంకుళం మనక్కళ్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహచర్యంతో స్వాతంత్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు. 1931 లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్యమం అభివృద్ధికి పునాదులు వేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రావిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యూనిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థితుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలంలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. 1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం)ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమీకరించడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీయ విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సమాజం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనలతో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్దే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరిచితుడే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఈయన ప్రభుత్వ పనితీరుల గుఱించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం



అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించవచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాల వుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్టవచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించిన పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు.ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడ దు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించ టానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చుకోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి.స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయోగించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం, వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించిన పుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచార మందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి.దుస్తులకు నిప్పంటు కున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పుకోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# చంద్రబాబు నాయకత్వంలో
# నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పాటు

## తెలుగుదేశం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతాఉల్లాహ్ ఆధ్వర్యంలో సంబరాలు



**విజయవాడ పశ్చిమ, జూన్ 12, (ఆంధ్రపత్రిక) :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయగానే తెలుగుదేశం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతాఉల్లాహ్ ఆధ్వర్యం లో ఒక్కసారిగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బుధవారం 54 ,55 డివిజన్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గణపతి రావు రోడ్డు లోని మొహమ్మద్ ఫతాఉల్లాహ్ కార్యాలయం ఖిద్మత్ ఘర్ వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి ప్రజలకు స్వీట్లు పంచీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా మాట్లాడుతూ ఈరోజు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు చాలా శుభదినం అని ఈరోజు నుంచి అరాచక పాలన అంతమైందని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి అతని అనుచరులు చేసిన అరాచకాలు అంతా ఇంతా కాదని, ముఖ్యంగా ముస్లింలకు అయితే చాలా చాలా బాధలు పెట్టారని ఎక్కడ కూడా ముస్లింల అభివృద్ధికి తోడ్పడలేదని తెలిపారు. ఇక చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉంటారని, రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, అలాగే రాష్ట్ర రాజధాని అమరావతి పురోగతివైపు పయనిస్తదని అన్నారు. అలాగే ప్రతి తెలుగుదేశం నాయకుడు, కార్యకర్తకు మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని సహకారంతో అలాగే పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ప్రజల సమస్యలు తీర్చే పెద్ద బాధ్యత మా అందరిపై ఉందని చెప్పారు.ఎన్నికల్లో ఎలా కలిసి పని చేసామో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశలో కూడా అందరూ కలిసి పని చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనలో మహిళలు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఇక తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళల పురోగతి ఉంటుందని, ఎక్కడ ఎటువంటి ఇబ్బందికర పరిస్థితిలో ఉన్న మీ ముందు ఉంటామని చెప్పారు. అలాగే రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత రాష్ట్ర మంత్రిగా అయినందుకు రాష్ట్ర మహిళలందరూ సంతోషిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తమిమ్ అన్సార్, జాహిద్, ఖయ్యాం, అబ్దుల్ హాది,షేక్ గౌస్,షేక్ సిలార్,దూండి రాజకుమార్, షేక్ ఫెరోజ్,దాఉద్, రాజు, షేక్ రేష్మా, షేక్ ముంతాజ్,కె మాల్లేశ్వరి, వై పద్మ, నశీమ, రేష్మా,తదితరులు పాల్గొన్నారు.

### మొక్కుబడి కొరకు తిరుమల బయలుదేరిన
## మార్టూరు వాసులు



**కొరిశపాడు మే12 (ఆంధ్రపత్రిక)** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం నుంచి పలుమంది తమ ఇష్ట దైవాలకు మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. శ్రీశైలం, తిరుమలకు ఇప్పటికే వేలాది మంది భక్తులు కాలినడకన ప్రయాణించి తెలుగుదేశం పార్టీమీద తమకి ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బుధవారం మార్టూరు చెందిన తగెడ్తా శ్రీకాంత్ పచ్చవ చెన్నయ్య యర్రా చైతన్య కాలినడకన తిరుమలకు బయలుదేరి ఆంధ్ర పత్రికతో మాట్లాడాతూ తమఅభిమాననాయకుడు నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా పర్చూరు ఎమ్మెల్యేగా మూడోసారి ఏలూరు సాంబశివరావు గెలిచినందున తిరుమలకు కాలినడకన వస్తామని మొక్కుకున్నామని వారం రోజుల్లో తిరుమలగిరి చేరుకొని తమ ఇష్ట దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కు తీర్చుకుంటామన్నారు

### బాపట్ల రోటరీ క్లబ్‌లో
## ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం లైవ్



**బాపట్ల జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి,నారా చంద్ర బాబు నాయుడు ,ఇతర మంత్రి వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్క్రీన్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రావణ్ కుమార్ కమిషనర్ బీ.శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని వీక్షిం చడానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్ ఓ పీ.సుబ్బారావు,అర్ ఐ ఇమామ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

### పెదతుమ్మిడి వంతెన పైనుంచి
## కాలువలో పడిన చేపల లోడుతో ఉన్న లారీ



**బంటుమిల్లి 12 జూన్ (ఆంధ్రపత్రిక) ;** కైకలూరు నుంచి పశ్చిమబెంగాల్ వెళుతున్న చాపల లోడుతో ఉన్న లారీ పెదతుమ్మిడి, జయపురం మధ్యలో గల బలహీనమైన వంతెన వద్ద ఎదురుగా వస్తున్న కారు తప్పించబోయి మురుగు కాలువలోకి పల్టీ కొట్టడం జరిగింది. ఈ ప్రమాదానికి కారణమైన కారును ఆపకుండా వెళ్లిపోవడం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు . ఈ బలహీనమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ఎప్పటినుంచో స్థానికులు అనేక పర్యాయాలు ధర్నాలు నిర్వహించి, అధికారులకు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. అయినా ఫలితం శూన్యం. కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఈ తరుణంలో ప్రజాప్రతినిధులు స్పందించి ఈ బలహీనమైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించి ప్రమాదాలను నివారించవలెనని ప్రజాప్రతినిధులకు స్థానికులు విన్నవించుకుంటున్నారు.

### కొలుసుకి మంత్రి పదవి దక్కడంతో
## కొలాహలం

**నూజివీడు జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, కోలుసు పార్థసారధికి , మంత్రి పదవి,వచ్చిన సందర్భంగా, నూజివీడు రెండో వార్డులో మరియు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తపరిచినారు ఈ వేడుకల్లో పాల్గొన్న వారు, తెలుగుదేశం పార్టీ 2 వ వార్డ్ మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, నూజివీడు టౌన్ సెక్రటరీ పల్లి నాగరాజు భూత్ ఏజెంట్ కందిపల్లి రాజేష్, పాశిల సత్యం, వార్డు ప్రెసిడెంట్ శ్రీ రెడ్డి సత్యనారాయణ, వార్డు సెక్రటరీ జామీ రవికిరణ్ , మరియు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,పల్లి చంద్రశేఖర్,పల్లి రాధాకృష్ణ, చిత్తూరి భాస్కర్ యాంద్రపు రవి మండల సురేష్, బొబ్బిలి ప్రసాద్ , ఏదురేసి వేంకటేశ్వర రావు (బాబు),తోత్తర శ్రీను ,రెడ్డి సత్యనారాయణ, అల్లు పైడినాయుడు ,రొంగల మనోజ్ కుమార్, షేక్ బాజీ, పెంటా మహేష్, మన్నేన మురళీ,ఆదిరెడ్డి దుర్గాప్రసాద్, మద్దు సతీష్, తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని మరింత ఆనందాన్ని వ్యక్తపరిచినారు.

### కర్లపాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో
## ప్రమాణ స్వీకరణ వేడుకలు



**కర్లపాలెం జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో గన్నవరం ఎయిర్ పోర్టు, కేసరపల్లి సమీపంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార వేడుకల వీక్షణ కోసం లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళా సంఘాలు హాజరై కార్యక్రమాన్ని వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళా సంఘాలు ఏర్పాటు నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని మహిళల అవసరాలు తెలిసిన మహిళా పక్షపాతి అన్నారు. మహిళలకు పెద్దపీఠం వేస్తారని ఆశిస్తూ హర్షం వ్యక్తం చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ కర్లపాలెం ఎమ్మార్వో నిర్మలానంద బాబా, ఎంపీడీవో నేతాజీ , ఈవోపీఆర్డి ఎలీషా బాబు, ఏపీ ఎం శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీ మోదీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బాల కార్మిక వ్యవస్థ
## నిర్మూలన చేయాలి



**బాపట్ల జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాపట్ల పట్టణంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరినీ బాల కార్మికులుగానే గుర్తించాలని,ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. పిల్లలు పనిలో ఉండకుండా బడికి వెళ్లే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం,సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిన రవి ప్రదీప్, సిడిపిఓ పురుషోత్తం,సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది బడుగు కిషోర్,నాగరాజు, ఐ సి డి ఎస్ సిబ్బంది రోజ్ లీనా,రాము, సులోచన,పారా లీగల్ వాలంటీర్స్ రవికుమార్,ప్రసాద్,రాజారావు సమూయేలు తదితరులు పాల్గొని బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం జరిగింది.

### మూల పాలెం లే అవుట్‌కు మార్గంలో
## వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు



**బాపట్ల జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** బాపట్ల పట్టణ పరిధిలోని మూల పాలెం జగనన్న కాలనీ కి వెళ్లే మార్గంలోని రోడ్డు టర్నింగ్ లో వీధి దీపాల ఏర్పాటు కు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ డీ ఈ శ్రీనివాసులు అన్నారు.స్తానిక ప్రజల అభ్యర్థన మేరకు రాత్రుల్లో ఇబ్బందుల దృష్ట్యా ప్రజల సౌకర్యర్థం వీటిని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ప్రజల కు సదుపాయాలు కల్పించడంలో మున్సిపాలిటీ అన్ని విధాలుగా సహకారం అంద చేస్తుందని వెల్లడించారు. కమిషనర్ బీ.శ్రీకాంత్ ఆదేశాల మేరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

### ప్రభుత్వ బడి పిల్లలకు
## విద్యా కిట్లు పంపిణీ



**బాపట్ల జూన్ 12 (ఆంధ్రపత్రిక) :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విద్యా కిట్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని బాపట్ల ఎం ఈ ఓ 1,2 ఏస్.నిరంజన్, డీ.ప్రసాద్ రావులు తెలిపారు.దీనిలో భాగంగా టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్, సమదుస్తులు,బ్యాగ్ ,బూట్లు,సాక్సులు, బెల్టులు అందిస్తున్నామన్నారు. బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎం ఎస్ పి నుంచి పంపిణీ కార్యక్రమం జరిగింది.రేపటికల్లా పంపిణీ పూర్తి అవుతుందని వెల్లడి చేశారు.13 నుంచి అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు , పునః ప్రారంభం అవుతాయని అన్నారు.

### కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన
## కృత్తివెన్ను టిడిపి శ్రేణులు



**కృత్తివెన్ను 12 జూన్ (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి గా కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లి న కృత్తివెన్ను మండల తెలుగు దేశం పార్టీ నాయకులు

### టిడిపి సీనియర్ నాయకులు గంగవరపు మురళి ఆధ్వర్యంలో
## చంద్రబాబు ప్రమాణ స్వీకార వేడుకలు



**విజయవాడ పశ్చిమ, జూన్ 12, (ఆంధ్రపత్రిక) :** ఎన్డీయే కూటమి తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం వేడుకలు బుధవారం ఉదయం తెదేపా సీనియర్ నాయకులు గంగవరపు మురళీ ఆధ్వర్యంలో సితార సెంటర్లో ఘనంగా నిర్వహించారు. గంగవరపు మురళీమోహన్ కార్యాలయం వద్ద ఎల్ ఈ డి స్క్రీన్ ఏర్పాటు చేశారు. నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి గా నాలుగో సారి పట్టాభిషేకం దృశ్యాలు గంగవరపు మురళి ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ పై వందలాది మంది తిలకించారు. ప్రమాణ స్వీకారం మహోత్సవం పూర్తి కాగానే ఇక్కడ బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టలేని ఆనందంగా ఈలలు వేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరపు మురళి తో పాటుగా నర్రావంశీ, సాయిసుధాకర్ , సోమశేఖర్ , నాగుల్ మీరా , మల్లె బోయినకొండ, వీరారెడ్డి , గాలిషా ,మాల కొండయ్య, రెడ్డిమోహన్ , జగన్ , హేమసుందర్ , కుమార్ , లోకేష్,అఖిల్,తదితరులు పండుగ చేసుకొన్నారు.

### చిన్నారుల తొలి విద్య భాండాగారాలు
## అంగన్వాడీ కేంద్రాలు
### ఐ.సి.డి.ఎస్.సి.డి.పి.ఓ సముద్ర వేణి



**బంటుమిల్లి 12 జూన్ (ఆంధ్రపత్రిక) :** చిన్నారుల తొలి విద్య అంగన్వాడీ కేంద్రాలలో ప్రారంభమై ఉన్నత స్థితికి చేరడానికి ఎంతగానో దోహదపడుతు న్నాయని సిడిపిఓ సముద్రవేణి, సూపర్వై జర్ రేవు నాగలక్ష్మి అన్నారు. అంగ న్వాడి కేంద్రాలలో విద్యను అభ్యసించి ఉన్నత చదువులకు వెళుతున్న చిన్నారు లకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ములపర్రు హరిజనవాడలోని అంగన్వా డీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను బంటుమిల్లి మండల వైస్ ఎంపీపీ చిన్నారి బాబు, మరియు ప్రెసిడెంట్ బొడ్డు మంగమ్మ, సిడిపిఓ సముద్ర వేణి సూపర్వైజర్ రేపు నాగలక్ష్మి చేతుల మీదుగా చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఉమాదేవి అంగన్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి ఎం హేమలత ఎం నాగరాణి బి భవాని మరియు చిన్నారులు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు


**దేవదాయ ధర్మదాయ శాఖ**
**శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానము**
**కొత్తపేట, విజయవాడ - 520001, ఎన్.టి.ఆర్.. జిల్లా,**
**టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన**

ఎన్.టి.ఆర్, జిల్లా, విజయవాడ పట్టణము, కొత్తపేటలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థాన చక్రములు గల జి. కొండూరు మండలం, వెలగలేరు గ్రామములోని ఈ దిగువ సభ్యులు దాఖలా భూములకు 6:26.06-2024 హక్కు ఉదయం 11.00 ని.లకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున గ్రామ సచివాలయ ఆవరణలో కౌలు హక్కులకు టెండర్-కమ్- బహిరంగ వేలంపాట జరుపబడును.

**షెడ్యూల్**

| వ.నెం | గ్రామము | సర్వే నెం | విస్తీర్ణము | భూమి వివరము | ధరావత్తు | లైసెన్స్ కాలపరిమితి |
|---|---|---|---|---|---|---|
| 01 | వెలగలేరు | 287/1 డి<br>287/2 ఎ | 00.39<br>01.61 | మాగాణి | రూ.5000/- | 2024-2025నుండి 2026-2027 వరుకు |

**బహిరంగ వేలంపాట షరతులు**

01. ఈ బహిరంగ వేలంపాట దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల ఆమోద ఉత్తర్వులకు లోబడి దేవస్థాన అధ్యక్షుల వారిచే నిర్వహించబడును.
02. దేవస్థానమునకు ఏ విధమైన బాకీలు ఉన్నవారు గానీ దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు ఉన్నవారుగానీ వేలంపాటలో పాల్గొనరాదు. వేలంపాట పాడుటకు తగిన అర్హతలు లేని వారిని వేలంపాటలో పాల్గొనకుండా చేయు అధికారము అధ్యక్షుల వారికి కలదు.
03. సాదారణముగా హెచ్చు పాటదారుని పాట అంగీకరించబడును. కానీ హెచ్చు పాటదారుని కాక పాటదారులలో మరియెకరిని ఎన్నుకొను అధికారము అధ్యక్షుల వారికి కలదు. ఏ కారణము చేతనైనా వేలంపాట నిలిపి వేయుట కానీ, వాయిదా వేయుట కానీ అధ్యక్షుల వారికి కలదు. ధరావత్తు మొత్త ము అవసరము వెంబడి తగ్గించుటకు గానీ, హెచ్చించుటకుగానీ అధ్యక్షులవారికి అధికారము కలదు.
04. ప్రతి పాటదారు తన స్థితిగతులు వగైరాలు తెలుపు నిర్ధారణ పత్రము (సాల్వేన్సి సర్టిఫికేట్) దాఖలు చేసి వేలంపాటకు ముందు సూచించిన ధరావత్తు చెల్లించి మరియు వారి సొంత ఆస్థి దస్తావేజులు వగైరా మరియు పట్టాదారు పాసు పుస్తకం అనగా టైటిల్ డిడ్ వేలంపాటకు ముందు దాఖలు చేసి వేలంపాటలో పాల్గొనవలెను.
05. వేలంపాట ఆఖరున హెచ్చు పాటదారుని ధరావత్తు మినహా మిగిలిన వారి ధరావత్తులు పాట పూర్తి అయిన పిదప వాపసు చేయబడును. అంగీకరించబడిన పాటదారుని ధరావత్తు ఆఖరి సంవత్సరము మక్తలో ముదరా చుసుకొనబడును. దీనికి వడ్డీ ఇవ్వబడదు.
06. డిపార్టుమెంటు అధికారులు వేలంపాట ఖాయపరచినట్లు తెలియపరచిన వారం పనిదినములలోగా అంగీకరించబడిన పాటదారు తన స్వంత ఖర్చున స్టాంపులు తెచ్చి అధ్యక్షుల వారు ఇచ్చు ముసాయిదా ప్రకారము కౌలు పత్రము వ్రాశించి రిజిస్టర్ చేఇంచి భూమిలో ప్రవేశించవలెను. కదపా రిజిస్టరు చేయనిదే అంగీకరించబడిన పాటదారు కౌలు భూమిలో ప్రవేశించరాదు.
07. అంగీకరించబడిన పాటదారు ఒక సంవత్సరము మక్తా సొమ్ము డిపాజిట్టుతో సహా కదపా రిజిస్టరు కాలమందు హామీగా ఇవ్వవలెను. సదరు హామీ రొక్కము ఆఖరి సంవత్సరము మక్తాలో ముదరా చూచుకొనబడును. దీనికి వడ్డీ ఇవ్వబడదు.
08. అస్తిలేని పాటదారు ఆస్థిగల మోతుబరి రైతుచే వారి యొక్క సొంత నిప్పేచి భూమిని దేవస్థానము పేరున హామీగా ఇప్పించవలెను. పాటదారు తరుపున హామీ ఇచ్చే రైతు తన అంగీకారము తెలియజేసినట్లు పాట జాబితాలో సంతకము చేయవలెను.
09. అంగీకరించిన పాటదారు నిర్ణీత కాలములో కదపా రిజిస్టరు చేయని యెడల మరియు ఒక సంవత్సరము కౌలు సొమ్ము చెల్లించని యెడల వేరే నోటిసుతో నిమిత్తము లేకుండా ధరావత్తు మొత్తము అపరాధ రుసుము క్రింద జమ కట్టుకొనుటయే గాక కౌలు భూమి తిరిగి వేలం వేయబడి అందు వల్ల వచ్చే నష్టం మొదటి హెచ్చు పాటదారుని వద్ద నుండి రాబట్టుకొనబడును.

ది:13.03.2024
విజయవాడ

అధ్యకులు
9848145438

# రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం....

## ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారంతో పురం టీడీపీ నాయకులు సంబరాలు...






**హిందూపురం, జూన్ 12 ( ఆంధ్రపత్రిక ):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం 11:00 గంటలకు ఓ శుభ ముహూర్తాన ప్రమాణస్వీకారం చేశారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ నందు పార్టీ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సలహాదారులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెదేపా వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకునే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిదంగా సీఎంగా చంద్రబాబు నాయుడు, మంత్రిగా కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భంలో జనసేన నాయకులు నిమ్మకాయల రాము ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జెఈ వెంకటస్వామి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్, తెలుగుదేశం నాయకులు పామిశెట్టి శేఖర్, గ్రీన్ పార్క్ నాగరాజ్, బేవనహల్లి ఆనంద్, జె పి కే రాము, డిఈ రమేష్, ఆ ర్ రమేష్, పరిమళతో పాటు భారీగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

## జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

### జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు




**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆయన చాంబర్లో కార్మిక, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరిలో అవగాహన చైతన్యం కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) సంయుక్త ఆధ్వర్యంలో 2002 నుండి ప్రతి ఏడాది ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. అన్ని శాఖల సమన్వయంతో బడి ఈడు బాలలను బడిలో చేర్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణకు కలిసి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డా. వెలగా జోషి, కార్మిక శాఖ అధికారులు శ్రీనివాసరావు, మహేశ్వరరెడ్డి, రత్నకుమారి, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఎం. రాజేశ్వరరావు, కిరణ్ కుమార్, శారద, రాణి, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్, బచ్పన్ బచావో ఆందోళన్ (బీబీఏ ) కోఆర్డినేటర్ కె. శ్రీకాంత్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు హృదయ రాజు, మోహనకృష్ణ, సునీల్, సంయుక్త ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం వీక్షణం



**సోమల ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):**రాష్ట్రంలో ఎన్.డి.ఏ.కూటమి అనూహ్య రీతిలో విజయం సాధించి బుధవారం నాడు ముఖ్య మంత్రి గా నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్రంలో ని ప్రజలు ఈ అపూర్వ సంఘటన వీక్షిం చేందుకు సౌకర్యం లేని అభిమానులకు ,ప్రజలకు ఆయా మండలం లోని ప్రభుత్వ కార్యాలయాలలోవీక్షించడాని కి వీలు కల్పించారు.ఈ క్రమంలో సోమల మండల ప్రజా పరిషత్ కార్యాల యం సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకార మహెూత్సవానికి చూడడానికి టి.వి లనుఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో హాజరైన స్థానిక తాసిల్దార్ నాగరాజు ఎంపీడీవో నారాయణ ,వి.ఆర్.ఓ.లు కార్యదర్శిలు ,అధికారులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దకొండామర్రిలో గంగ జాతర



**చౌడేపల్లి,జూన్12(ఆంధ్రపత్రిక):** పెద్దకొండామర్రి లో బుధవారం ఘనంగా గంగ జాతరను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన జాతరలో పలు కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, తమిళనాడు, కర్ణాటక నుంచి వివిధ కళాకారులు తరలివచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జాతరకు హైలెట్గా వారి నృత్యాలు నిలబడ్డాయి. తెల్లవారు జామున మహిళలచే దీపారాధన విశేష దర్శనము జరిగాయి. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతరను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతరను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ప్రతి వీధిలోను మిరిమిట్లు గొలిపే, విద్యుత్ దీపాలంకరణ, రంగురంగుల పూలతో దివ్యాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని చూసేందుకు ఈ ప్రాంతం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

# మూకుమ్మడిగా ముక్కంటి మండలి రాజీనామా



**శ్రీకాళహస్తి, జూన్ 12 (ఆంధ్రపత్రిక):** శ్రీకాళహస్తి ఆలయ ధర్మ కర్తల మండల అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు వారి వారి పదవులకు రాజీనామా చేశారు. అధికారంలోకి రావడంతో మండల సభ్యులు కొంతమంది మరుసటి రోజు రాజీనామా చేశారు. అయితే మరి కొంతమంది సభ్యులు, అధ్యక్షులు రాజీనామా చేయకపోవడంతో వారిపై విమర్శ లు వచ్చాయి. అయితే ఎట్టకేలకు ఆలయ ధర్మకర్తల మండలి ముకు మ్మడిగా రాజీనామాలు చేసి ఆ పత్రాలను శ్రీకాళహస్తి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నాగేశ్వరరావు కు బుధవారం అందజేశారు.

# గ్రామ దేవత చెల్లెమ్మకు మొక్కులు తీర్చుకున్న టిడిపి నాయకురాలు చిట్టెమ్మ

**తొట్టంబేడు ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో బుధ వారం తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్య పాళెంకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకురాలు మునిరాజశ్రీరెడ్డి అలియాస్ చిట్టెమ్మ మొక్కులు తీర్చు కున్నారు. ఈ సందర్భంగా ఆమె సాంబయ్యపాళెంలోని గ్రామ దేవత చెల్లెమ్మకు 101 కొబ్బరికాయలు కొట్టారు.



శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యేగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి విజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి కావాలంటూ తాను చెల్లెమ్మ దేవతకు మొక్కుకు న్నానని తన కోరిక నెరవేరడంతో మొక్కులు తీర్చుకున్నామని చిట్టెమ్మ తెలిపారు. మొక్కులు అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు.

# ప్రశాంత వాతావరణంలో ముగిసిన గంగ జాతర







**సోమల ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం లో గంగ జాతర ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ క్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఆనవాయితీగా వస్తున్న గంగ జాతరను నంజం పేట ,పొదల కుంట పల్లి ,సూరయ్య గారి పల్లి ,ఇరికి పెంట తదితర గ్రామాల్లో గ్రామస్తులు భక్తులు అమ్మవారికి పొంగ ల్లు ,దివ్వెల ను తయారు చేసి ఆయా గ్రామ దేవతల కు సమర్పిం చారు. అనంతరం సోమల పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం అమ్మవారు సాయంత్రం వరకు కొలువు తీరి భక్తులు కు దర్శనం ఇచ్చారు.అసాది వారి పాటలతో అమ్మవారిని సంతోష పరచి జల్దికి పోవడానికి మంగళ వాయిద్య లతో ,బాణా సంచాల తో అంగ రంగ వైభవంగా చర్యలు తీసుకున్నారు.మండలం లో ఆయా ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది .సంతోషంగా బంధు మిత్రులు తో గ్రామాలు పులకించిపోయాయి.

# చంద్రబాబుకు శుభాకాంక్షలు



**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా నాలుగోసారి ప్రమాణస్వీ కారం చేసిన నారా చంద్ర బాబు నాయుడుకు పెజ్జోనిపేట టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశా రు. బుధవారం పెజ్జోనిపేట సెంటర్ లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

అలాగే జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రజలకు మేలు కలిగే పాలన, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్తారని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు ముజీబ్, కనపర్తి అంకయ్య, దుర్గ, చిలుకోటి వెంకటేశ్వర్లు, కనపర్తి బాలాజీ, హరికృష్ణ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# "ఇగ్నైట్" ఫెస్ట్‌ని నిర్వహించిన విజ్ఞాన్ ఆన్‌లైన్







**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ,రీసెర్చ్ (డీమ్డ్ టు బి యూనివర్శిటీ) యొక్క ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్, విజ్ఞాన్ ఆన్‌లైన్ విజయవంత ంగా తమ వార్షిక కార్యక్రమం "ఇగ్నైట్" ను ఇటీవల నిర్వహిం చింది. విజ్ఞాన్ ఆన్‌లైన్ యొక్క కమ్యూనిటీ ప్లాట్‌ఫారమ్, వివో ఎక్స్ (విజ్ఞాన్ ఆన్‌లైన్ ఎక్స్పీరియన్స్ ) ఈ సమావేశం నిర్వహి ంచింది, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విజ్ఞాన్ ఆన్‌లైన్ రెండింటి నుండి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు అభ్యాసకు లను ఒక చోట ఇది చేర్చింది.దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విజ్ఞాన్ కమ్యూనిటీని ఏకం చేయడం, నెట్‌వర్కింగ్ మరియు కనెక్షన్ కోసం ఒక ప్రాంగణం అందించాలనే తన లక్ష్యం"ఇగ్నైట్" నెరవేర్చుకుంది. ఈ కార్యక్రమంలో లైవ్ సంగీతం, నృత్య ప్రదర్శనలు, సరదా కార్యకలాపాలు, వర్క్‌షాప్ లు మరియు ముఖాముఖి చర్చల కోసం పుష్కలమైన అవకాశాలు లభించాయి. విజ్ఞాన్ గ్రూప్ విజ్ఞాన్ ఆన్‌లైన్ యొక్క సీఈఓ శ్రీకాంత్ నందిగం ఈ కార్యక్రమం పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేస్తూ "భారతదేశంలోని మా అభ్యాసకులను విజ్ఞాన్ క్యాంపస్‌కి స్వాగతి ంచడం చాలా ఆనందంగా ఉందన్నారు. 'ఇగ్నైట్' వారు కనెక్ట్ కావడానికి, విభిన్న సంస్కృతులను అభినందించడానికి విజ్ఞాన్ యొక్క కమ్యూనిటీ స్ఫూర్తిని అనుభవించడానికి ఒక అద్భుత మైన వేదికను అందించింది" అని అన్నారు.

# కూటమి ప్రభుత్వంలో తిరుమల భక్తులకు సంతృప్తి దర్శనం

## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలన తిరుమల క్షేత్రంపై పడింది

**తిరుమల, జూన్ 12 (ఆంధ్రపత్రిక):** భక్తుల దర్శన విషయంలో పెనుమార్పు లను చేశారు. ఐ.ఎ.ఎస్ అధికారులకు టిటిడి కార్యనిర్వాహక అధికారి బాధ్యత లను అప్పగిస్తూ వస్తోంది. అలాంటిది ఐడిఇఎస్ అధికారి ధర్మారెడ్డి కార్యనిర్వహ ణాధికారి బాధ్యతలతోపాటు భక్తి ఛానల్, మేనేజింగ్ డైరెక్టర్, తిరుమల అడిషనల్ ఇఓ బాధ్యతలను వైఎస్ ప్రభుత్వం కట్ట బెట్టింది. తిరుమలలో నేను చెప్పిందే వేదం. పాలకమండలి కూడా ధర్మారెడ్డి అడుగుజాడల్లో నడవాల్సిందే. టిటిడి ఉన్నతాధికారులు కూడా ధర్మారెడ్డి ముందు బలాదూర్. బ్రేక్ దర్శన విషయం లో మార్పులు చేయడం వల్ల భక్తులతో పాటు టిటిడి అధికారులు సైతం ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. శ్రీవాణి దర్శన టికెట్ల విషయంలో కూడా భక్తులు ఇబ్బం ది పడ్డారు. వికాలాంగులు, వృద్ధులకు కరెంటు రిజర్వేషన్ తీసివేసి దర్శనంలో ఆన్‌లైన్ పద్ధతి ప్రవేశపెట్టి 3 నెలలవరకు



శ్రీవారి దర్శన టిక్కెట్ దొరకడం కష్టతరం అవుతున్నది. గదుల విషయానికి వస్తే ఆన్‌లైన్‌లో గదులు నమోదు చేస్తున్న భక్తులకు గది ఖాళీ చేసిన తదుపరి కూడా డిపాజిట్ భక్తునికి చేరలేదు. ఇందు గూర్చి పలువురు భక్తులు డయల్ యువర్ ఇఓలో సంప్రదిస్తే వారికి ఇఓ నుంచి సరైన సమాధానం కరువైంది. ఇదిలా ఉం టే దర్శన టోకెన్‌లు లేని భక్తులు శిలా తోరణం వరకు క్యూలైన్‌లలో రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారికి అవసరమగు తాగునీరు, వసతికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాక సకాలం లో భక్తులకు సరైన ఆహారం అందక చంటి బిడ్డల తల్లులు, పిల్లలు క్యూలైన్‌ల లో అవస్థలు పడ్డారు. ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ధర్మా రెడ్డికి తిప్పలు తప్పవని సెలవుపై వెళ్లడం జరిగింది. భక్తులకు టిటిడి హితోధిక సౌక ర్యాలు కల్పిస్తూ భక్తులకు సేవలు అంది ంచే సమర్థవంతమైన ఐఎఎస్ అధికారి నిని టిటిడి కార్యనిర్వహణాధి కారిగా నియమిస్తారని భక్తుల మనోభావా లను గ్రహించి వేలాది కిలోమీటర్లు, వ్య య ప్రయాసలకోర్చి తిరుమలను సందర్శి ంచిన భక్తులకు వసతితోపాటు నేత్రానంద కరంగా దర్శనం, తగినంత ప్రసాదం అందిస్తారని పలువురు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# 'మూవ్ కూల్' ను ఆవిష్కరించిన మూవ్




**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** మూవ్ భారతదేశపు ప్రముఖ నొప్పి ఉపశమనం బ్రాండ్, 'మూవ్ కూల్' ను విడుదల చేసింది, కోల్డ్ థెరపీతో ప్రేరేపించబడిన గొప్ప ఆవిష్కరణ ఇది. మెంథాల్ యొక్క కూలింగ్ పవర్ తో, ఈ కొత్త ఉత్పత్తి చురుకైన జీవనశైలి కారణంగా గాయాలు, బెణుకులు, కండరాల నొప్పి స్ట్రెయిన్స్ కారణంగా కీళ్లు మరియు కండరాల నొప్పి నుండి ఉపశమనం అందించడానికి రూపొందించబడింది.డిసెంబర్ 2021లో నిర్వహించిన రెకిట్ పెయిన్ ఇండియా డిసీజి డిమాండ్ సర్వే ప్రకారం, భారతదేశంలో 4000కి పైగా రెస్పాండెంట్స్ తో, సుమారు 8% రెస్పాండెంట్స్ తమ నొప్పి సంఘటనలు వ్యాయామం లేదా క్రీడలకు సంబంధించినవని చెప్పారు. మూవ్ కూల్ కండరాల నొప్పి, బెణుకులు, స్ట్రెయిన్స్ సహా శారీరక ధారుడ్యానికి సంబంధించిన గాయాలను పరిష్కరిస్తుంది.ఇది ప్రభావానికి గురైన ప్రదేశాన్ని మొద్దుబరిచి కేవలం 15 సెకండ్లలో పని చేయడం ఆరంభిస్తుంది ఈ విడుదల గురించి వ్యాఖ్యానిస్తూ, కనికా కల్రా, రీజనల్ మార్కెటింగ్ డైరెక్టర్, హెల్త్ , న్యూట్రిషన్, రెకిట్ సౌత్ ఏషియా ఇలా అన్నారు. "భారతదేశంలో అత్యంత నమ్మకమైన నొప్పి ఉపశమనం కలిగించే బ్రాండ్స్ లో ఒకటిగా, మూవ్ భారతీయులు తమ నొప్పిని నిర్వహించడంలో దశాబ్దాలుగా సహాయపడుతోంది. మారుతున్న జీవనశైలులు, క్రీడలు మరియు ఫిట్నెస్ కి సంబంధించిన గాయాలు మరింత సర్వసాధారణమయ్యాయి తక్షణమే నొప్పి నుండి ఉపశమ నంక కోసం వినూత్నమైన పరిష్కారాల కోసం వినియోగదారులు అన్వేషిస్తున్నారు. ఈఅవసరాలను పరిష్కరించడానికి, కోల్డ్ థెరపీతో ప్రేరేపించబడిన సూత్రీకరణతో మేము మూవ్ కూల్ ను పరిచయం చేయడానికి ఆనందిస్తున్నాం. ఇదిబెణుకులు, కండరాల నొప్పి స్ట్రెయిన్స్ వంటి గాయాల వలన కలిగిన కండరాలు కీళ్ల నొప్పుల నుండి వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తుంది. మా ప్రేక్షకుల పెరుగు తున్న అవసరాలను తీర్చడానికి మా ఉత్పత్తి ఆవిష్కరణను మరింత మెరుగుపరచడానికి ఉత్తమమైన పరిష్కారాలను అందించడానికి మా నిబద్ధతకు ఈవిడుదల ఒక నిరూపణగా నిలుస్తుందన్నారు.

# బ్రతికి ఉన్న వారి పేర్లతో వున్న ప్రభుత్వ పథకాల పేర్లను మార్చండి

## - జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



**గుంటూరు,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ లో గత ఐదు సంవత్సరాల కాలంలో జగనన్న లాంటి బ్రతికి వున్న వారి పేర్లతో వున్న పథకాల పేర్లను మార్చాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే అమరులైన మహనీయుల పేర్లను పెట్టాలని కోరారు. నూతన మంత్రివర్గ కూర్పు అన్ని ప్రాంతాల, కులాల, మతాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మంచి టీం ను నారా చంద్ర బాబు నాయుడు ఎంపిక చేశారని తెలిపారు. వైకాపా పాలనలో ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందని, అరాచక పాలన, అభివృద్ధి నిరోధక పాలన ను ఓటర్లు కసితో తిరస్కరిం చారన్నారు. గత ప్రభుత్వ అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, తద్వారా భవిష్యత్తులో రాజకీయ, అధికార అవినీతి లకు ఆస్కారం లేకుండా చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓటర్లు సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలని, ప్రతీకార చర్యలు0డరాదని, ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరగాలని కోరుకు న్నారని వివరించారు. బూతులు మాట్లాడే నేతలను, అరాచక, అవినీతి శక్తులను ప్రజలు ఓడించారని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా చెల్లించి అన్ని అవసరమైన పథకాలను అమలు చేయాలన్నారు. యన్.డి.ఎ లో భాగస్వామిగా వుండ టం వలన రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకో వడానికి కృషి జరగాలన్నారు. రాజధాని విష యంలో మూడు ముక్కల ఆటను ప్రజలు తిరస్కరించారని, అన్ని ప్రాంతాల సమ అభివృద్ధికి కృషి చేస్తా మని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. విధ్వం సాలు, కక్ష సాధింపు చర్యలుడవని, తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని, జనసేన నేత పవన్ కళ్యాణ్, నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని గమనించి స్థానిక నేతలు ప్రతీ కార చర్యలకు, దాడు లకు ఆస్కారం ఇవ్వరాదని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# భారతదేశంలో మొట్టమొదటి ఫీచర్‌ఫోన్ హెచ్‌ఎండి105 విడుదల




**విజయవాడ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న హెచ్ ఎండి 105 పరికరాన్ని విడుదల చేస్తున్నట్లు హెచ్ఎ ఒడి ప్రకటించింది. అసాధారణమైన పనితీరు, సొగసైన డిజైన్, పరి శ్రమ ప్రముఖ ప్రమాణాలను మిళితం చేస్తూ, కంపెనీ యొక్క సంచ లనాత్మక ఉత్పత్తుల వారసత్వంపై ఆధారపడి రూపొందించిన హెచ్ ఎండి 105 ఒక ప్రధాన సాంకేతిక పురోగతిని సూచిస్తుంది. ఈ ఫోన్ అంతర్నిర్మిత యుపిఐ అప్లికేషన్‌తో వస్తుంది. ఇది హెచ్‌ఎండి ఫోన్‌ల విశ్వసనీయతను యుపిఐ సౌలభ్యం, యాక్సెసిబిలిటీతో మిళితం చేస్తుంది. వినియోగదారులు స్మార్ట్‌ఫోన్ లేకుండా కూడా యుపిఐ చెల్లింపు లావాదేవీలను సురక్షితంగా, సజావుగా నిర్వహి ంచడానికి ఇది వీలు కల్పిస్తుంది.

# హనుమంతు,గజ వాహనాలపై ఇంద్రవరదుడి విహారం





**యాదమరి,జూన్, 12 : (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రంలోని త్రివేణి గాయత్రి సరస్వతి సంగమంలో వెలసిన ఇంద్ర వరదుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రాతఃకాలం మూలవిరాట్టుకు శ్రీదేవి భూదేవి సమేత ఇంద్ర వరుదునికి ప్రత్యేక పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం యాదమరి దేవ రాజులు,బాబు మొదలి ఉభయం దారులుగా నిర్వహించారు. అనంతరం ఉదయం సప్రంలో ఉత్సవం ఉభయ దేవేరులతో మాడ వీధుల్లో శ్రీరామా అవతరంలో హనుమంతు వాహనంపై విహరిం చారు యాదమరికి చెందిన నంద్యాలం రాజేంద్ర శెట్టి,అయ్యప్ప శెట్టి కుటుంబం సభ్యులు ఉభయం చేశారు.సాయంత్రం నారాయణ స్వామి,రాజేంద్ర గౌండర్ సభ్యులు నాచ్చియార్ తిరుక్కోలం మోహిని రూపంలో వరదరాజులు స్వామామి ఉత్సవం ఘనంగా నిర్వహిం చారు. రాత్రి శ్రీదేవి పెరిందేవి సమేత ఇంద్ర వరదరాజల స్వామి వారి కల్యాణోత్సవం యాదమరి అంజేరి శ్రీరాములు కుటుంబ సభ్యులు శివప్రసాద్,సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణ వేడుక కళ్యాణ వరదరాజులు స్వామి వారి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.రాత్రి అంకాళ పరమేశ్వరి ఆలయం టస్టు చిత్తూరు వారు గజవాహనం ఉభయం చేశారు.వరదుడు కళ్యాణ వరదరాజులుగా శ్రీదేవి, పెరందేవి,సమేత కళ్యాణ వరదుడి గా కొత్త పెళ్ళి కుమారుడుగా నిత్య నూతనంగా శోభాయ మానంగా యాదమరి పురవీధుల్లో ప్రజలకు దర్శనమిచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.స్వామి వారి బ్రహ్మోత్స వాలు సందర్భంగా బుడితి రెడ్డి పల్లి గ్రామవాస్తవ్వులు తులసీశ్వర్, గిరిజ దంపతులు వరదరాజుల స్వామికి బుధవరం సాంప్రదాయ పట్టు వస్త్రాలు సమర్పించారు.బ్రహ్మోత్సవాలలో నేడు,గురువారం, ఉదయం- మూలవర్లకు పుష్ప కైంకర్యం, మధ్యాహ్నం రథోత్సవం (తేరు)సాయంకాలం,తేరు మెట్ల ఉత్సవం, రాత్రి,తోట ఉత్సవం కార్యక్రమాలు జరుపనున్నట్లు ఆలయ కమిటి పేర్కొన్నారు.

## మండల తెదేపా నేతల సంబరాలు



**యాదమరి,జూన్, 12 : (ఆంధ్రపత్రిక):** కూటమి నేతల ఉమ్మడి అభ్యర్థిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. బుధవారం విజయవాడ కేసరేపల్లి ఐటి మేధా పార్కులో తెలుగు దేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం నేప థ్యంలో మండల అధ్యక్షుడు మురార్జీ ఆధ్వరంలో తెదేపా నాయ కులు హేమగిరి (చిట్టి),అమరనాథ నాయుడు,సుభాష్ నాయుడు, గుణశేఖర్ రాయాల్,ధరణీ ప్రకాష్, నాయకులు కార్యకర్తలు స్థానిక జోడి చింతల నుండి బాణాసంచా కాల్చి ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని అధికారులు ఏర్పాటు చేసిన బుల్లితెరలో ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించి,కేక్ కోసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.

## స్టూడెంట్స్ కిట్ అందజేత



**హిందూపురం, జూన్ 12 ( ఆంధ్రపత్రిక ):** హిందూపురం మండ లంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు స్టూడెం ట్ కిట్ల సరఫరా స్టాక్ పాయింట్ ఎంజీఎం పాఠశాల నుండి బుధ వారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు మొదలగు వాటిని విద్యార్థులకు పంపిణీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 హెచ్ గంగప్ప ,ఎంఈఏ 2 ప్రసన్నలక్ష్మి, సి ఆర్ ఎం టి లు, పి టి ఐ లు ,ఎంఐఎస్ నందిని, కంప్యూటర్ ఆపరేటర్ తోసిఫ్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణాస్వీకారం సందర్బంగా మోతుకపల్లిలో అన్నదానం



**హిందూపురం, జూన్ 12 ( ఆంధ్రపత్రిక ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుదవారం ఉదయం ప్రమాణస్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మునిసిపల్ పరిధిలోని 21వ వార్డు మోతుకుపల్లిలో మీడియా కో ఆర్డినేటర్ చంద్ర మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ నారా చంద్ర బాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్, అనిల్ కుమార్, శివ,మంగేష్ తో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రత్యేక పూజలు

**నందికొట్కూర్ ,జూన్ 12 ( ఆంధ్రపత్రిక ) :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నందికొ ట్కూరు లో తెదేపా నాయకులు ప్రత్యే క పూజలు నిర్వహించారు.



పట్టణంలోని కోటా వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మురళీధర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలనలో చంద్ర బాబు నాయుడుకు చాలా అనుభవం ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా వెనుక బడిన రాష్ట్రం చంద్రబాబు రాకతో ముందుకు పోతుందన్నారు. ముఖ్యంగా రైతాంగానికి తెదేపా ప్రభుత్వం అండగా ఉంటుంద న్నారు. ప్రమాణ స్వీకారం రోజే వరుణుడు కరుణించడం శుభసూ చకమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ జెడ్పిటిసి నాగేశ్వరరావు, గుణశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర ఆచారి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే తరానికి ఆదర్శంగా చంద్రన్న పాలన

**- మాధవరావు దేశాయ్**



**నందవరం జూన్ 13 (ఆంధ్రపత్రిక ) :** సార్వత్రిక ఎన్నికలలో అఖండ విజయాన్ని సాధించి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిన్నటి రోజున ప్రమాణ స్వీకా రం చేయడం జరిగింది.రాష్ట్రంలో తమ పార్టీ అధికారం లోకి రావడం వల్ల నందవరం లో టిడిపి శ్రేణులు బాణసంచా కాలుస్తు సంబరాలు చేసుకున్నారు.నందవరం టిడిపి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశయ్ కు గ్రామ టిడిపి కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి శాలువా, పూలమా లతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాధవరావ్ దేశయ్ మాట్లాడుతు నిన్నటి రోజు వరకు రాష్ట్రానికి పట్టిన దృష్ట శక్తుల తొలగిపోయాయన్నారు. చంద్రన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో ఉంటుంద న్నారు. చంద్రబాబు స్పష్టమై న నిర్ణయాలే కూటమి గెలుపుకు కారణాలు అన్నారు. బాబు చెప్పిన ప్రకారము అమరావతే రాజధానిగా బాబు ప్రకటించార న్నారు. అనేక రకాలైన కల్తీ మద్యం అమ్మకాలతో రాష్ట్ర ప్రజల ప్రాణాల ను బలిగొన్న జగన్ మద్యం పాలసీకి బాబు స్వస్తి పలికి ప్రజల కు తక్కువ ధరలకే నాణ్యమైన సరుకుతో మద్యం పాలసీని ప్రవేశపెట్ట భోతున్నారన్నారు.ఇప్పటికే కొన్ని చోట్ల అన్నా క్యాంటీన్లు మొదలై పేద ప్రజల ఆకలి తీర్చడంలో టిడిపి ప్రభుత్వం ముందడుగు వేసింది అన్నారు. చంద్రన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే తరాలకు ఆదర్శంగా చంద్రన్న పాలన ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా

## బొల్లినేనిఅన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బొజ్జల బృందమ్మ, రిషితా రెడ్డి



**శ్రీకాళహస్తి ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** శ్రీకాళహస్తి పట్టణంలోనీ జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేనిజగన్నాథం నాయుడు దంపతులు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల.వెంకట సుధీర్ రెడ్డి తల్లి బృందమ్మ ఆయన సతీ మణి రిషితా రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నిరుపేదలకు అన్నా క్యాంటీన్ లేకపోయినప్పటికీ నిత్య అన్నదానం చేస్తున్న బొల్లినేని దంపతులను ఆశీర్వదించి, అభినందించారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా ఈ అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా బొల్లినేని జగన్నాథం నాయుడు దంపతులు మాట్లాడుతూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని తిరిగి మరల అన్నా క్యాంటీన్ ప్రారంభించేంతవరకు నిరుపేదల కు నిత్య అన్నదానాన్ని కొనసాగిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు విజయకుమార్, నర్రా మోహన్ నాయుడు, తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు,పాల సొసైటీ మాజీ చైర్మన్ మునిరాజు నాయుడు, శ్రీకాళహస్తి మహిళా అధ్యక్షురాలు సుభాషిని,రాంబాబునాయుడు,ప్రజాపతి నాయుడు, వెంకటేష్, బొల్లినేని అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య కూటమి నాయకుల సంబరాలు



**చౌడేపల్లి,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి గా జనసేన అని మంత్రిగా మరో 23 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కూటమినేతలు ఆనందో త్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు. కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద నారా చంద్రబాబు నాయుడు అనే నేను అనగానే మండల లో సంబరాలు మిన్నంటాయి. స్థానిక బస్టాండులో భారీ కేకులు కట్ చేసి అందరికీ పెంచి పెట్టారు. అదేవిధంగా అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

బాణాసంచా పేల్చితూ తమ అభిమా నాన్ని చాటుకున్నారు. మండలంలో గల సచివాలయాలు, ఆర్. బి.కె కేంద్రాలలోనూ ఎల్ఈడి స్క్రీన్ లపై వస్తున్న ప్రసారాలను ప్రజలందరూ ఏకాగ్రతతో వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, పూల చంద్రమౌళి, గడ్డంవారిపల్లి వెంకటరమణ, జంపాల శ్రీనివా సులు, కార్తీక్, విద్యాసాగర్, నారాయణరాజు, అర్జున్, దొరస్వామి రెడ్డి, శంకర, భాస్కర్ రెడ్డి, మనోహర్, గందోడి ప్రవీణ్ కుమార్, వాసుదేవ రెడ్డి, మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆశీస్సులతో రాష్ట్రంలో చంద్రోదయం

**-డా.యం.ఉమేష్ రావు , నెమళ్ళూరు బుజ్జి**



**శ్రీకాళహస్తి ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** గడచిన ఐదు సంవత్స రాలుగా దుష్ట శక్తుల కబంధ హస్తాలలో నలిగిపోయిన తెలుగు నేలను కాపాడుకోవడానికి అలుపెరుగని పోరాటం చేసిన చంద్ర బాబు , పవన్ కళ్యాణ్ లకు అండగా నిలబడిన దుర్గాదేవి ఆశీస్సు లతో రాష్ట్రంలో చంద్రోదయం అయ్యిందని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పేర్కొన్నారు.గడచిన ఎన్నికలలో అఖండ విజయం సాధిం చిన ఎన్డీయే కూటమి, తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడ సమీపంలోని కేసరపల్లి అనే ప్రాంతం వద్ద దేశ, విదేశీ ప్రతినిధుల సమక్షం లో, ఎన్డీయే మిత్ర పక్షాలకు చెందిన నాయకు లు , కార్యకర్తల నడుమ ఉదయం 11:27 నిమిషాలకు ప్రమాణస్వీకార మహో త్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం రాష్ట్ర చరిత్రలో మరపురాని ఘట్టం అని ఉమేష్ పేర్కొన్నారు.సరిగ్గా ప్రమాణస్వీకారం జరిగే సమ యానికి ఇంద్రకీలాద్రి పైన వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీకాళహస్తి నుండి తీసుకొచ్చిన పాలకోవాను భక్తులకు పంచి పెట్టడం జరిగిందని తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమ ళ్ళూరు బుజ్జి తెలిపారు.జగన్మోహన్ రెడ్డి యొక్క పిచ్చి తుగ్లక్ చేష్టలతో అతలాకుతలం అయిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిత ను స్వర్ణమయం చేయడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి తమ ఆశీస్సులు మెండుగా అందించమని కనకదుర్గమ్మ తల్లిని వేడుకు న్నట్లు నెమళ్ళూరు బుజ్జి తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయ కులు బీమాల భాస్కర్ ముదిరాజ్, చిల్లకూరు మణి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, శివ, రాప్తాడు నియోజకవర్గ నాయకులు నాగరాజు మరియు పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## బోయకొండ ధర్మకర్తల మండలి సభ్యుల రాజీనామా

**చౌడేపల్లి,జూన్12(ఆంధ్రపత్రిక):** శక్తి క్షేత్రం బోయకొండ ధర్మ కర్తల మండలి సభ్యులు రాజీనామా చేశారు. ధర్మకర్తలి మండలి సభ్యులుగా ఉన్న బుడ్డమ్మ, భారతి, హైమావతిలు బుధవారం తమ రాజీనామా పత్రాలను ఈవో చంద్రమౌళికి అందించారు. వైకాపా పరాజయం పాలైన సందర్భంగా నైతిక విలువలు పాటిస్తూ రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే ఆలయ చైర్మన్ నాగరాజు రెడ్డి, మరో ధర్మకర్త మండలి సభ్యుడు రాజేష్ లు రాజీనామా చేసి ఉన్నారు.

### సీఎం ప్రమాణ స్వీకారం వేళ ..

## గూడూరులో మిన్నంటిన సంబరాలు





**గూడూరు ,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రుల ప్రమాణ స్వీకారం సందర్భంగా గూడూరు పట్టణం లోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రజలు తిలకించేందుకు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు .గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ మరియు మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలకించారు. టిడిపి నాయకులు కార్యకర్తలు బానసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. టిడిపి నాయకులు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజల ఎంతో నమ్మకంతో టిడిపి పార్టీని గెలిపించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని అన్నారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా సునీల్ కుమార్ ని ప్రజలు ఆశీర్వదించారని ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నానాజీ పులిమీ శ్రీనివాసులు చెంచురామయ్య లీలావతి మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు .అదేవిదంగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా గూడూరు రెండో పట్టణ పరిధిలోని జి.ఎస్.రాయులు సెంటర్ , మాలవ్యనగర్ లోని వినాయకుని గుడి వద్ద టీడీపి నాయకులు బాణాసంచా కాల్చి , స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సి.అర్ కళ్యాణ మండపంలో లో సి.ఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలకించేందుకు ఎల్. ఈ.డి. స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఎల్. ఈ.డి స్క్రీన్ లను ఏర్పాటు చేశారు.

## లేపాక్షిలో ఘనంగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం



**లేపాక్షి , జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా నాలుగవసారి ప్రమాణం చేసిన సందర్భంగా మండల కేంద్రంలో తెలుగుదేశం బిజెపి జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గొంగటిపల్లి సోమిరెడ్డిపల్లి వెంకటాపురం లేపాక్షి గ్రామాలకు చెందిన అనేక మంది కార్యకర్తలు నాయకులు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర చేరుకొని మొదట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ,ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తదనంతరం స్వీట్లు పంచి సంఘీభావం తెలుపుకున్నారు. అంతేకాకుండా వారందరికీ లేపాక్షి మాజీ సర్పంచ్ కీర్తిశేషులు కే అంజనప్ప గారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది .ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు జనసేన నాయకులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోచ్‌కు క్రీడా కారులు ఆర్థిక సహాయం



**ఎమ్మిగనూరు. జూన్ 12 (ఆంధ్రపత్రిక):** పట్టణంలో ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తునందున మెరుగైన వైద్యం కోసం వై. ఎఫ్.సి క్రీడా సభ్యులు సుమారుగా రూ లక్షా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ న్యుమోనియాతో బాధపడుతున్న కారణంగా వై. ఎఫ్. సి క్రీడా సభ్యులు నివాసానికి సందర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మేమంతా నీకు అండగా ఉంటామని అభయం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రీడా కారులు మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్లబ్ ( వై ఫ్. సి సభ్యులు సుమారుగా రూ.లక్ష ఐదు వేల నగదును ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం మున్నా బాధిత కుటుంబానికి వై.ఎఫ్.ఎ క్రీడా సభ్యులు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వై.ఎఫ్.సి క్రీడా సభ్యులు విక్రమ్, పెద్దఈరన్న, ప్రసాద్, వీరేష్, ముని, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, హనీఫ్, కర్ణకార్ రెడ్డి, శ్రీరాములు, సిజి ఈరన్న, విజయ్, చాంద్, లతీఫ్, నరసింహారాజు లు పాల్గొన్నారు

## బిజెపి కార్యాలయంలో ఎన్డీఏ కూటమి సంబరాలు



**శ్రీకాళహస్తి ,జూన్ 12 (ఆంధ్ర పత్రిక) :** శ్రీకాళహస్తి పట్టణంలోనీ బిజెపి కార్యాల యంలో ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బుధ వారం ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా బిజెపి కార్యాలయం వద్ద బాణ సంచా లతో టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసుకొని బుధవారం సంబరాలు జరుపుకున్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్ గరికపాటి రమేష్ బాబు అమర్నాథ్ కంద్రిగ ఉమా ఉమా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన చంద్రన్న

**విజయవాడ, జూన్ 12 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గత ఎన్నికల్లో అతిపెద్ద విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబుతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్‌తో పురంధేశ్వరి, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ గవర్నర్ తమిళసై, మాజీ సిఎం పన్నీరు సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు. వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు వచ్చారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు



రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించు కున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో... పవన్ కల్యాణ్ (జనసేన), నారా లోకేశ్ (తెదేపా), అచ్చెన్నాయుడు (తెదేపా),కొల్లు రవీంద్ర (తెదేపా),. నాదెండ్ల మనోహర్ (జనసేన),పి. నారాయణ (తెదేపా), వంగలపూడి అనిత (తెదేపా), సత్యకుమార్ యాదవ్ (భాజపా),నిమ్మల రామానాయుడు (తెదేపా), ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా), పయ్యావుల కేశవ్ (తెదేపా), అనగాని సత్యప్రసాద్ (తెదేపా),కొలుసు పార్థసారథి (తెదేపా), డోలా బాలవీరాంజనేయ స్వామి (తెదేపా),గొట్టిపాటి రవి (తెదేపా), కందుల దుర్గేశ్ (జనసేన), గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా), బీసీ జనార్దన్‌రెడ్డి (తెదేపా), టీజీ భరత్ (తెదేపా),ఎస్.సవిత (తెదేపా), వాసంశెట్టి సుభాష్ (తెదేపా), కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా), మందిపల్లి రామ్‌ప్ర సాద్ రెడ్డి (తెదేపా) ఉన్నారు. ప్రమాణం చేసిన వారంతా తెలుగు లోనే దైవసాక్షిగా ప్రమాణాం చేశారు. ఎన్ఎండి ఫరూక్ తెలుగులోనే అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. టిజి భరత్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఒక్కొక్కరే ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు, ఇతర పెద్దలకు అభివాదం చేశారు. చంద్రబాబు పలువురిని మోడీకి పరిచయం చేశారు. పవన్ కళ్యాణ్ వేదికపై అందరికి అభివాదం చేసి, తన అన్న చిరంజీవికి మాత్రం పాదాభివందనం చేశారు.

**నేటి సాయంత్రం సిఎం చంద్రబాబు బాధ్యతల స్వీకరణ**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు స్వీకరించను న్నారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో అధికారులు ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛను రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సైన్సెస్‌పై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం చేయనున్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలను అధికా రులు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రమాణ స్వీకారం తర్వాత ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులతో చంద్రబాబు సమావేశమయ్యారు. మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు ఈ సందర్భంగా మంత్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం అనంతరం గురువారం అమరావతి చేరుకుంటారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపి పాలనలోజరిగిన అవకతవకలు, విధ్వంసంపై టీడీపీ ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేయనుంది. రాష్ట్రంలో విధ్వంసంపై శాఖల వారీగా విడుదల చేయనున్నట్లు సమా చారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అక్రమాలపై వరసగా శ్వేతపత్రాలు విడుదల చేయనున్నారు. రాష్ట్ర విభజనకు పూర్వం కాంగ్రెస్ హయాం లో జరిగిన విధ్వంసాలపైనా 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇలాగే స్వేతపత్రాలు విడుదల చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో చర్చ మెదలైంది. వైసీపీ హయాంలో ఇసుక, మద్యం పాలసీలపై అప్పటి ప్రతిపక్షాలు విపరీతంగా ఆరోపణలు చేశాయి. ఇసుక ఇష్టానుసారం తోడేస్తున్నారని, కల్తీ మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. గనుల శాఖలోనూ పలు అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి.

# ఒడిషాలో సీఎంగా తొలి గిరిజన నేత

**బిజెపి సిఎంగా మోహన్ చరణ మాఝి ప్రమాణం**
**ఇద్దరు ఉప ముఖ్యమంత్రులకు అవకాశం**
**హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు**
**కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సిఎం నవీన్ పట్నాయక్**





**భువనేశ్వర్, జూన్ 12:** ఒడిశాలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. నూతన ముఖ్యమంత్రిగా మోహన్ చరణ మాఝి ప్రమాణస్వీకారం చేశారు. దీంతో రాష్ట్రంలో భాజపా తరపున తొలి సీఎంగా రికార్డు సృష్టించారు. ఆయనతోపాటు ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, తొలిసారి ఎమ్మెల్యే అయిన ప్రవతి పరీదాలు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. వీరితోపాటు మంత్రులుగా సురేశ్ పుజారి, రబీనారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కృష్ణ చంద్ర పాత్ర ప్రమాణం చేశారు. గవర్నర్ రఘుబర్‌దాస్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులతో పాటు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ కూడా హాజరయ్యారు. అంతకుముందు తాజా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌తో మోహన్ చరణ్ భేటీ అయ్యారు. నవీన్ నివాస్‌కు వెళ్లిన ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని నవీన్‌ను స్వయంగా ఆహ్వానించారు. ఈ క్రమంలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నవీన్ హాజరయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 78 స్థానాల్లో విజయం సాధించిన భాజపా.. రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే, గిరిజన నేత మోహన్ చరణ్ మాఝి రైతు బిడ్డ. ఆయన తండ్రి సెక్యూరిటీ గార్డుగానూ పని చేశారు. 1997 నుంచి 2000 వరకు సర్పంచిగా పనిచేసిన మాఝి.. 2000లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. భాజపా గిరిజన మోర్చాకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన ఆయన... కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2024 వరకూ శాసనసభలో భాజపా సభాపక్ష కార్యదర్శిగా, చీఫ్ విప్‌గా విధులు నిర్వహించారు.

# గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,జూన్ 12 (ఆంధ్రపత్రిక):** గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. అక్టోబర్ 21వ తేదీ నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంలలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి పేపర్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 9వ తేదీన గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. త్వరలోనే ఫలితాలను విడుదల చేయనున్నారు. మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ ఇలావుంది. అక్టోబర్ 21 జనరల్ ఇంగ్లీష్ (క్వాలిఫయింగ్ టెస్ట్).అక్టోబర్ 22 పేపర్ 1(జనరల్ ఎస్సే). అక్టోబర్ 23 పేపర్ 2(హిస్టరీ, కల్చర్ అండ్ జియోగ్రఫీ). అక్టోబర్ 24 పేపర్ 2 (ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం అండ్ గవర్నెన్స్). అక్టోబర్ 25 పేపర్ 4(ఎకానమి అండ్ డెవలప్‌మెంట్). అక్టోబర్ 26 పేపర్ 5(సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్‌ప్రిటేషన్). అక్టోబర్ 27 పేపర్ 6(తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్)

# ఉగ్రవాది క్షమాభిక్ష తిరస్కరణ

(మొదటిపేజీ తరువాయి)

దాడికి పాల్పడ్డారు. సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడిలో పాక్ ఉగ్రవాదికి ఉరిశిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పిచ్చింది. దీంతో ఉగ్రవాది ఆరిఫ్ తన ప్రాణాలను రక్షించాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశాడు. ఇప్పుడు అక్కడ కూడా అతని క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించబడింది. అయితే మహ్మద్ ఆరిఫ్‌కు ఇంకా ఒక ఆప్షన్ మిగిలి ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 (రాజ్యాంగ పరిష్కారాల హక్కు) ప్రకారం ఆరిఫ్ శిక్షలో రాయితీని కోరవచ్చని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా.. 22 డిసెంబర్ 2000న ఉగ్రవాదులు ఎర్రకోటలోకి ప్రవేశించారు. వారు 7 రాజ్‌పుతానా రైఫిల్స్ సైనికులపై పెద్ద ఎత్తున కాల్పులు జరిపారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లు వీరమరణం పొందారు. దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత ఆరిఫ్ అలియాస్ అషఫ్కాను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. సుప్రీం కోర్టు మరణ శిక్ష విధించగా.. రాష్ట్రపతికి క్షమాభిక్ష కోరాడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మే 15న ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ క్షమాభిక్ష పిటిషన్‌ను స్వీకరించారు. ఆగస్టు 27న ఎర్రకోట దాడిలో దోషిగా తేలిన పాక్ ఉగ్రవాది క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించినట్లు రాష్ట్రపతి సచివాలయం ఆగస్టు 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఏపీలో శాంతి భద్రతలను పరిరక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

దాడులకు తెగబడుతున్నాయి. వక్రీకరించే బుద్ధి చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులకే ఉంది" అంటూ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. "చట్టం లేదు, సేచ్ఛ లేదు, న్యాయం లేదు. అన్యాయమే రాజ్యమేలుతోంది. బాధితులు ఫిర్యాదు చేస్తామన్నా పోలీసులు స్వీకరించే పరిస్థితి లేదు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. వెళ్లాయి.. కానీ ఎలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వాళ్ల ఆస్తులే లక్ష్యంగా చేసుకుని టీడీపీ శ్రేణులు స్వైర విహారం చేస్తున్నాయి. మీరు టీడీపీ కార్యకర్తలా.. గూండాలా?. ప్రమాణస్వీకారానికి ముందే చంద్రబాబు హింసను ప్రేరేపించారు. హింసకు గురైన బాధితులు ఆక్రందనలు చంద్రబాబుకు కనిపించడం లేదా?" అని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. "ఇది చీకటి అధ్యాయంగా చరిత్రలో మిగిలిపోతుంది. టీడీపీ దాడులు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్నవాళ్లపై దాడి చేసి, సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారు. మంగళగిరిలో లోకేష్ మనుషులు సోషల్ మీడియా కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. బంగారం లాంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టీడీపీ తగలబెడుతోంది.

ఈ హింస ఇలాగే కొనసాగితే బీజేపీ కూడా బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇలా దాడులు చేయడం మంచి సంప్రదాయం కాదు. చివరకు మీడియా స్వేచ్ఛను కూడా అణచివేస్తున్నారు. ఏపీలో రాజ్యాంగం కుప్పకూలిపోయింది."అని విజయ సాయి ధ్వజమెత్తారు.

## లైంగిక వేధింపుల కేసులో మాజీ సీఎం యడియూరప్పకు నోటీసులు

**కర్ణాటక, జూన్ 12:** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే అభియోగాలపై కర్ణాటక మాజీ సీఎం, బీజేపీ నేత యడియూరప్పకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోక్సో (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ) కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని కర్ణాటక పోలీసు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) నుంచి నోటీసులు వచ్చాయి. 17 ఏళ్ల మైనర్ బాలికపై యడియూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఈ ఏడాది ప్రారంభంలో కేసు నమోదైంది. చీటింగ్ కేసులో సాయం కోసం ఫిబ్రవరి 2న యడియూరప్ప సాయం కోసం వెళ్లిన సందర్భంలో తన కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. యడియూరప్పపై పోక్సో యాక్ట్‌తో పాటు ఐపీసీలోని సెక్షన్ 354(ఏ) కింద లైంగిక వేధింపుల కేసు నమోదైంది. యడియూరప్ప తన న్యాయవాదుల ద్వారా సీఐడీ ముందు హాజరు కావడానికి ఒక వారం పొడగింపు కావాలని అభ్యర్థించారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నారు. ఇప్పటికే విచారణ బృందం మూడుసార్లు విచారించింది. ప్రస్తుతం ఆయన నాలుగోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంది. తొలుత సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తదుపరి విచారణ కోసం సీఐడీకి బదిలీ చేశారు.

అయితే, యడియూరప్ప మాత్రం ఈ ఆరోపణల్ని ఖండించారు. నిరాధారమైనవిగా పేర్కొన్నారు. 81 ఏళ్ల యడియూరప్ప కర్ణాటక బీజేపీలో సీనియర్ నేత. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2008-2011 మధ్య, 2018లో కొంత కాలం, మళ్లీ జూలై 2019-2021 వరకు సీఎంగా పనిచేశారు. 2021లో సీఎంగా రాజీనామా చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు బెయిల్ తిరస్కరణ

**హైదరాబాద్,జూన్12(ఆంధ్రపత్రిక):**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. నిందితులను విచారించాల్సి ఉందని, వారికి బెయిల్ మంజూరు చేయొద్దని ప్రభుత్వ తరుపు న్యాయవాది వాదించారు. ఆయన వాదనలతో ఏకీభవించిన కోర్టు బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

ప్రస్తుతం వీరు చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు.

# ఢిల్లీలో బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ, జూన్ 12:**దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఢిల్లీలోని 15 మ్యూజియంలకు తాజాగా బాంబు ఉన్నట్లు హెచ్చరికలు వచ్చినట్టు పోలీసులు బుధవారం చెప్పుకొచ్చారు. ఈ మెయిల్స్ ద్వారా వార్నింగ్స్ వచ్చినట్టు పేర్కొన్నారు. దీనిపై సమాచారం అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఎంక్వైరీ చేపట్టారు. ఆయా మ్యూజియంలలో బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అయితే, సోదాల్లో భాగంగా ఎలాంటి అనుమానిత వస్తువులు దొరకలేదని బాంబ్ స్క్వాడ్ తెలిపింది. దీంతో బాంబ్ బెదిరింపులు బూటకమని.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఇటీవల ఢిల్లీలోని పాఠశాలలు, ఆస్పత్రులతో సహా ఎయిర్ పోర్టుకు సైతం వరుసగా బాంబ్ బెదిరింపులతో కూడిన ఈ మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. కాగా, వరుస బాంబు బెదిరింపుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో ఆందోళన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో జన సందోహం ఎక్కువగా ఉండే ఏరియాల్లో పోలీసులు భద్రతను భారీగా పెంచేశారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆమె ఈ మేరకు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేయకపోతే ప్రజలు గుణపాఠం చెప్పగలమని ఈ ఫలితాల ద్వారా నిరూపించారని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందని, 164 సీట్లతో ఇంత పెద్ద మెజారిటీ కూటమికి వస్తుందని ఎవరూ ఊహించలేదని, ఇదొక నిశ్శబ్ద విప్లవమని పురందేశ్వరి అన్నారు. తెలుగు ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, కూటమికి అధికారం ఇచ్చిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు అని ఆమె అన్నారు. టిక్కెట్లు రాకపోయినా హైకమాండ్ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయడం శుభపరిమాణమని అన్నారు. ఢిల్లీలో అగ్రనేతలు కూటమి విజయాన్ని అద్భుతంగా పొగుడుతున్నారని, బీజేపీ తరపున సమన్వయ కమిటీలు వేశామని ఆమె అన్నారు. సమన్వయంగా ఉంటూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో తీసుకుపోవాలని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో అమరావతి, పోలవరం నిర్మాణం మన ప్రాధాన్యత. అమరావతిలో ఐదేళ్ల తర్వాత విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. అమరావతి, పోలవరం నిర్మాణంపై సమన్వయంతో ముందుకు వెళతాం. వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేదు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. ప్రతిపక్షం లేదు... ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపైనే ఉంది. రాష్ట్రంలో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర అభివృద్ధి గాడిలో పెడుతూ నిజమైన సంక్షేమాన్ని ప్రజలకు అందించాలి. మనం అధికారంలో ఉంటూ పార్టీని మరింత అభివృద్ధి చేసుకోవాలని పురందేశ్వరి అన్నారు. పురందేశ్వరి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. పదాధికారుల సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ సహ-సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్ హాజరయ్యారు. కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, రామకృష్ణా రెడ్డి, ఈశ్వరరావు, విష్ణు కుమార్ రాజు, పార్థసారథి ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ తరపున గెలిచిన ఎంపీలను, ఎమ్మెల్యేలను బీజేపీ ఏపీ పదాధికారులు, జిల్లాల ఇన్‌చార్జిలు సత్కరించారు.

# గెలుపు కోసమే మత రాజకీయం

**న్యూఢిల్లీ, జూన్ 12 :** ఓట్ల కోసమే బీజేపీ ప్రభుత్వం రామమరందిరం నిర్మాణం చేస్తే.. అయోధ్య ప్రజలు మతపరమైన రాజకీయాలకు ప్రోత్సాహం ఇవ్వమని చెప్పకనే చెప్పారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పూణే జిల్లాలోని బారామతిలో శరద్ పవార్ మాట్లాడారు. ఆలయ రాజకీయాలను ఎలా సరిదిద్దగలరో అయోధ్య ప్రజలు చేతల్లో చూపించారని, బీజేపీని ఓడించి ఆలయ రాజకీయాలను సరిచేశారని వ్యాఖ్యానించారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో అయోధ్య ఆలయం ఉండే ఫైజాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఓటమి చెందిన విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో 300 కంటే ఎక్కువ సీట్లు గెలిచిన బీజేపీ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 240 సీట్లకు పడిపోయిందని పవార్ అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 60 సీట్లు తగ్గాయని, ఇది చాలా తక్కువ మెజార్టీ అని చెప్పారు. ఈ సీట్ల తగ్గుదలలో ఉత్తరప్రదేశ్ కీలక రాష్ట్రంగా మారిందని, ఇక్కడి ప్రజలు విలక్షణమైన తీర్పు ఇచ్చారి పవార్ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తెలివైన వారని, ఆలయం పేరిట ఓట్లు అడుగుతున్నారని గ్రహించి వైఖరి మార్చుకున్నారని తెలిపారు. ఫలితంగా బీజేపీ ఓటమి చెందిందన్నారు.ఓట్లు అడిగేందుకు రామమందిరమే ఎన్నికల అజెండాగా అయోధ్య ఆలయాన్ని ఉపయోగించడాన్ని చూసి తాము భయపడ్డామని పేర్కొన్నారు. కానీ ప్రజలు రాజకీయాలను మత విశ్వాసాలను కలిపి చూడరని ముందే ఊహించానన్నారు. అందుకే ప్రజలు అనుకున్న దానికంటే భిన్నమైన తీర్పు ఇచ్చారన్నారు. దీంతో ఫైజాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి లల్లూ సింగ్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దేశంలో ప్రజాస్వామ్యం చెక్కు చెదరకుండా ఉందని, దానిని అంతం చేయడం రాజకీయాలతో సాధ్యం కాదని ఆయన వ్యాఖ్యానించాడు.పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉండి నచ్చిన విధంగా మార్పులు చేర్పులు చేశారని, దీంతో ప్రజలు ఆ పార్టీ నాయకులను తిరిగి నేలమీదకు తెచ్చారని పవార్ విమర్శలు చేశారు. అయితే మోదీజీ.. సొంత మెజార్టీ ఎక్కడ అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది సొంతంగా సాధించిన మెజార్టీతో కాదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీష్ కుమార్ సహాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. కూటమితో ప్రభుత్వం నడిచే సమయంలో అందరి ఆలోచనలకు అనుగుణంగా పాలన చేపట్టాలన్నారు. అయితే ఇక నుంచి మోదీ సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదని ఎద్దేవా చేశారు.

# బాధ్యతలు స్వీకరించిన నిర్మలా సీతారామన్

**తొలి మహిళా ఆర్థిక మంత్రిగా రికార్డు**

**న్యూఢిల్లీ, జూన్ 12:** నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థికమంత్రిగా మోడీ కెబినెట్‌లో మరోసారి చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీంతో వరుసగా రెండోసారి ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిమహిళగా నిర్మలా రికార్డుకెక్కారు. బుధవారం ఉదయం నార్త్ బ్లాక్‌కు చేరుకున్న ఆమెకు ఆర్థికశాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. నిన్న ఆమె ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి ఆర్థికమంత్రిగా నిర్మలా వచ్చేనెలలో 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కాగా, నిర్మలా 2014 మోడీ తొలిసారి ప్రధాని అయినప్పుడు ఆయన కేబినెట్‌లో పరిశ్రమలు, వాణిజ్య శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2017లో రక్షణశాఖ బాధ్యతలు చేపట్టారు. ఇక 2019లో మోడీ కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా నిర్మలాకు చోటు దక్కింది. ఇప్పుడు మూడోసారి మోడీ మంత్రివర్గంలో నిర్మలా ఆర్థికమంత్రిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించారు.

# కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వంటగదిలో మంటలు చెలరేగాయి. అవి క్రమంగా అపార్ట్మెంట్‌లోని అన్ని గదులకు వ్యాపించాయి. కొందరు ప్రాణాలను దక్కించుకునేందుకు అగ్నిప్రమాదాన్ని గమనించి బయటకు దూకడంతో మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరికొందరు పొగ పీల్చడంతో, కాలిన గాయాలతో ఊపిరాడక మరణించారు. ఈ ప్రమాదంలో గాయపడినవారు అదాన్, జాబర్, ముబారక్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించిన భవనంలో ఎక్కువగా తమిళనాడు, కేరళ, ఉత్తర భారత ప్రజలు నివసిస్తున్నారు. కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "కువైట్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదం బాధాకరం. నా ఆలోచనలు తమ సన్నిహితులను, ప్రియమైన వారిని కోల్పోయిన వారందరిపై ఉన్నాయి. క్షతగాత్రులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. బాధితులకు సహాయం చేయడానికి అక్కడి అధికారులతో కలిసి పని చేస్తోంది" అని మోడీ చెప్పారు.

# మహారాష్ట్రలో వర్ష బీభత్సం..

**మరత్వాడా, జూన్ 12:** మహారాష్ట్రలోని మరత్వా డా ప్రాంతంలో వర్షం బీభత్సం సృష్టించింది. జూన్ 1 నుంచి ప్రారంభమైన వర్షాల ప్రభావం తో.. ఇప్పటి వరకు 14 మంది చనిపోయారు. ఇందులో పిడుగుపాటు కారణంగా 11 మంది మృతి చెందారు. డివిజనల్‌కమిషనర్ కార్యాలయం రూపొందించిన ప్రాథమిక సర్వే నివేదిక ప్రకారం.. గత రెండు రోజుల్లో పర్భానీ, హింగోలి జిల్లాల్లో నాలుగు మరణాలు నమోదయ్యాయి. జూన్ 1 నుంచి మరత్వాడాలోని ఏడు జిల్లాల్లో వర్షాల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో నాలుగు మరణాలు గత రెండు రోజుల్లోనే సంభవించాయి. నలుగురు బాధితుల్లో ఇద్దరు 14 ఏళ్ల బాలుడు, 40 ఏళ్ల మహిళ ఉన్నారు. వరద నీటిలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందగా, ఆవుల కొట్టం కూలి ఒకరు మృతి చెందారు. మరాత్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ఏడింటిలో ఈ మరణాలు సంభవించాయి. సర్వే నివేదిక ప్రకారం, లాతూర్ జిల్లాలో అత్యధికంగా నాలుగు మరణాలు సంభవించగా, పర్భానీ మరియు నాందేడ్ ఒక్కొక్కటి మూడు మరణాలు నమోదయ్యాయి. మరో నాలుగు జిల్లాలు.. జల్నా, హింగోలి, బీడ్ మరియు ధరాశివ్ ఒక్కొక్కరు మరణించారు. జూన్ 1 నుంచి మరాత్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా మనుషులే కాకుండా 251 జంతువులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. గత రెండు రోజుల్లో 99 జంతువులు చనిపోయాయి. భారీ వర్షాల కారణంగా జూన్ 12న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్, ఆరెంజ్ అలర్ట్‌లను వాతావరణ శాఖ ప్రకటించింది. మరోవైపు.. బీడ్ జిల్లాలో గత రెండు రోజుల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో.. మజల్‌గావ్ తాలూకాలోని కోతల గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి నదికి వరద పోటెత్తింది. లాతూర్ జిల్లాలోని నెల్వాడ్ గ్రామంలో వ్యవసాయం భూమి, రోడ్లు జలమయమయ్యాయి. గ్రామం నుంచి బయటకు వెళ్లే రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ భూమిలోకి నీరు చేరడంతో మట్టి కొట్టుకుపోయింది. వాగులు పొంగి పొర్లడంతో రహదారులు మూసుకుపోయాయి.

# పేద ప్రజలే నా దేవుళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్ బరేలి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. దీంతో అతను వయనాడ్ లేదా రాయ్‌బరేలిలో ఒక స్థానాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ విషయంపై రాహుల్ గాంధీ స్పందించారు. తన డైలమాలో ఉన్నానని.. వయనాడ్, రాయ్ బరేలిలో ఏ నియోజకవర్గాన్ని వదులుకోవాలో తనకు తప్ప అందరికీ తెలుసని అన్నారు. తను తీసుకునే నిర్ణయంతో రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉండటమే తనకు కావాలని తెలిపారు. ఇక ప్రధాని మోదీపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అగ్రనేత. తాను దురదృష్టవశాత్తు మోదీలా కాకుండా మనిషిని అని.. ప్రధానిలా తనని ఏ దేవుడు గైడ్ చెయ్యడం లేదని అన్నారు. తనకు దేశంలోని పేదలు, వయనాడ్ ప్రజలు దేవుళ్లని తెలిపారు. అందుకే తాను వయనాడ్ ప్రజలకు కట్టుబడి ఉంటానన్నారు. ఇక అయోధ్య, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఓటమి గురించి రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ఆత్మను, ప్రజల ఆలోచనలపై దాడి చేయడం వల్లే బీజేపీ ఓటమి పాలయ్యిందని అన్నారు. మన రాజ్యాంగంలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్ అంటారన్నారు రాహుల్. రాష్ట్రాలు, భాషలు, చరిత్ర, సంస్కృతి, మతం, సంప్రదాయాల కలయిక భారతదేశం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కాగా ఇటీవలి ముగిసిన ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి పోటీ చేసి తన సమీప సీపీఐ అభ్యర్థి అన్నీ రాజాపై 3 లక్షల 64 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధా వయనాడ్ నుంచి పోటీ చేసి 4.3 లక్షల రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ మెజారిటీపై గాంధీ మాట్లాడారు. కేంద్రంలో ఏర్పడుతున్న ప్రభుత్వం వికలాంగ ప్రభుత్వం అని, ప్రతిపక్షాలు బీజేపీని చావుదెబ్బ కొట్టాయని అన్నారు. ప్రధాని మోదీ తన వైఖరి మార్చుకోవాల్సి ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రతిపక్షాలుగా తాము ప్రజల బాగు కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామన్నారు.

# చంద్రబాబు పట్టాభిషేకానికి విచ్చేసిన అతిరథమహారథులు



నారా చంద్రబాబు నాయుడు గారి ప్రమాణస్వీకారానికి హాజరైన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవ రెడ్డి

ఆంధ్రపత్రిక ఫోటోలు : సి.హెచ్.విజయభాస్కర్

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com